ఈనాడు
కాకినాడ
సోమవారం అక్టోబరు 14, 2024

ప్రతిభతో మురిసె..



బాలుర జట్టుకు ట్రోఫీ అందిస్తున్న ఎంపీ గంటి హరీష్ మాధుర్

రామచంద్రపురం వేదికగా జరిగిన రాష్ట్రస్థాయి సబ్ జూనియర్స్ బాస్కెట్‌బాల్ పోటీల్లో తూర్పుగోదావరి జిల్లా బాల, బాలికల జట్లు విజేతగా నిలిచాయి. మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఈ పోటీలు ఆదివారంతో ముగిశాయి. - న్యూస్‌టుడే, రామచంద్రపురం

ఆనందం వెల్లివిరిసె

రాజమహేంద్రవరం శివారు గైట్ కళాశాలలో నిర్వహిస్తున్న ఎన్‌సీసీ శిక్షణ తరగతులు అట్టహాసంగా ముగిశాయి. దేశంలో మొత్తం 17 ఎన్‌సీసీ డైరెక్టరేట్ల నుంచి ప్రత్యేకంగా ఎంపిక చేసిన 300 మంది సీనియర్ ఎన్‌సీసీ క్యాడెట్లు 12 రోజులు నిర్వహించిన శిక్షణ తరగతుల్లో ప్రతిభ చూపారని ఎన్‌సీసీ 18 ఆంధ్ర బెటాలియన్ కాకినాడ గ్రూపు కమాండర్ ఆర్.ఎం. అగర్వాల్ చెప్పారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన ఎన్‌సీసీ క్యాడెట్లు తమ సంస్కృతీ సాంప్రదాయాలను ప్రతిబింబించే విధంగా ముగింపువేడుకలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. - న్యూస్‌టుడే, రాజానగరం



క్యాడెట్ల సాంస్కృతిక ప్రదర్శన

లెక్క తేలింది.. కిక్కు ఎవరికో!

- లాటరీ విధానంలో లైసెన్సుల మంజూరు నేడు
- ఉమ్మడి జిల్లాలో దరఖాస్తు రుసుము ద్వారా ప్రభుత్వానికి రూ.236.06 కోట్ల ఆదాయం



కలెక్టరేట్‌లోని వివేకానంద హాలులో ఏర్పాట్లు

ఈనాడు, కాకినాడ, న్యూస్‌టుడే, మసీదు సెంటర్(కాకినాడ)

ఉమ్మడి జిల్లాలోని మద్యం దుకాణాలకు వచ్చిన దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ పూర్తయ్యింది. కాకినాడ, తూర్పుగోదావరి, అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లో ప్రభుత్వం నోటిపై చేసిన మద్యం దుకాణాలను లాటరీ పద్ధతిలో సోమవారం కేటాయిస్తారు. ఉమ్మడి జిల్లా అబ్కారీ డీసీ వై.చైతన్యమురళీ పర్యవేక్షణలో యంత్రాంగం దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ పూర్తిచేసింది. లాటరీకి కాకినాడ, అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ కార్యాలయాలతో పాటు.. తూర్పుగోదావరి జిల్లాలో ఆనం కళాకేంద్రంలో ఏర్పాట్లు చేశారు. మూడు జిల్లాల కలెక్టర్లు పర్యవేక్షణలో జేసీలు, డీఆర్వోలు, ఆర్డీవోలతో పాటు.. అబ్కారీ యంత్రాంగం ప్రక్రియ పూర్తి చేయనున్నారు. సోమవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంటలోగా మద్యం దుకాణాల కేటాయింపు ప్రక్రియ కొలిక్కిరావచ్చని భావిస్తున్నారు. లాటరీ ప్రక్రియ పూర్తయ్యాక.. ఈనెల 15న ప్రైవేటు మద్యం దుకాణాలు అప్పగిస్తారు. 16 నుంచి కొత్త మద్యం విధానం అమల్లో భాగంగా వ్యాపారాలు కొనసాగనున్నాయి.

మద్యం దుకాణాలు-దరఖాస్తులు ఎన్నంటే..?

జిల్లా	నోటిపై చేసిన దుకాణాలు	వచ్చిన దరఖాస్తులు	దరఖాస్తు ఆదాయం (రూ.కోట్లలో..)
కాకినాడ	155	3,332	66.64
అంబేడ్కర్ కోనసీమ	133	4,087	81.74
తూర్పుగోదావరి	125	4,384	87.68

లక్ష్యం అలా.. స్పందన ఇలా..

దుకాణాలకు దరఖాస్తులు ఆహ్వానించిన ప్రభుత్వం ఒక దుకాణానికి కనీసం 30 దరఖాస్తులు వస్తాయని భావించి.. 1:30గా లక్ష్యాన్ని నిర్దేశించింది. దరఖాస్తుల స్వీకరణ గడువు ముగిశాక పరిశీలిస్తే ఉమ్మడి జిల్లాలో ఒక్కో దుకాణానికి సగటున 28.57 దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తుల రూపంలో ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వానికి నాన్ రిఫండబుల్ రూపంలో రూ.236.06 కోట్ల ఆదాయం సమకూరింది. ■ తూర్పుగోదావరి జిల్లాలో సగటున ఒక్కో దుకాణానికి అత్యధికంగా 35.07 దరఖాస్తులు వస్తే.. అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో సగటున ఒక్కో దుకాణానికి 30.72 దరఖాస్తులు, కాకినాడ జిల్లాలో 21.43 దరఖాస్తులు రావడం గమనార్హం.

ఎంటీ పాస్‌తో హాజరు కావాలి

లాటరీ తీసేందుకు ఏర్పాట్లు చేశాం. దరఖాస్తుదారులంతా ఉదయం 7 గంటలకు ప్రభుత్వ గుర్తింపు కార్డుతో పాటు ఎంట్రీ పాస్‌లతో హాజరుకావాలి. లాటరీలో పాల్గొనేందుకు అభ్యర్థుల బదులు వారి ఆథరైజేషన్ ఇచ్చిన యెడల, దరఖాస్తుదారుని సంతకం చేసిన సెల్ఫ్ అటెస్టెడ్ గుర్తింపు కార్డుతో పాటు ప్రభుత్వ గుర్తింపు కార్డుతో హాజరుకావాలి. - ఎం.కృష్ణకుమారి, ఎక్సైజ్ సూపరింటెండెంట్

కనులనిండుగా దసరా..







దసరా పండగ వేళ జిల్లాలో ఉత్సవాలు అంబరాన్ని తాకాయి. కాకినాడలో బాలాత్రిపుర సుందరి అమ్మవారు బంగారు చీరలో భక్తులకు దర్శనమిచ్చారు. జిల్లా ఆర్మ్డ్ రిజర్వ్ ప్రధాన కార్యాలయంలో ఎస్పీ విక్రాంత్‌పాటిల్ ఆయుధ, వాహన పూజలు చేశారు. ఆర్మ్డ్ రిజర్వ్, పోలీసు బలగాలు వినియోగించే ఆయుధాలు, వాహనాలకు పూజలు చేశారు. కాకినాడ గ్రామీణం శ్రీపీఠంలో మార్వాడీ మహిళలు భక్తి తన్మయత్వంతో నృత్యాలు చేశారు. -న్యూస్‌టుడే బృందం



మృతి చెందిన ఆదిలక్ష్మి..



వృద్ధురాలు మృతికి కారణమైన గుంత

ప్రాణం తీసిన.. గుంత..

రహదారిపై గుంత.. ప్రయాణానికి ఇబ్బంది మాత్రమేకాదు. ప్రాణాపాయమని చెప్పిన ఘటన కాకినాడ జిల్లా సామర్లకోట మండల శివారు మాధవపట్నం-కాకినాడ ప్రధాన రహదారిలో ఆదివారం చోటు చేసుకుంది. అయిదేళ్లపాటు వైకాపా ప్రభుత్వం రహదారులకు మరమ్మతులు చేపట్టకుండా వదిలేసిన నిర్లక్ష్యాన్ని ప్రశ్నిస్తోంది. బాధిత కుటుంబ సభ్యులు, స్థానికుల సమాచారం మేరకు.. తాళ్లరేవు మండలం జార్జిపేటకు చెందిన దొంతమ ఆదిలక్ష్మి(65), భర్త భద్రరావుతో కలిసి ద్విచక్ర వాహనంపై జార్జిపేట నుంచి పెద్దాపురంలో శుభకార్యానికి బయలేదేరారు. మాధవపట్నం సమీపంలో వారి ద్విచక్ర వాహనం రహదారిపైనున్న గుంతలోంచి వెళ్లడంతో కుదుపునకు వాహనంపై కూర్చున్న ఆదిలక్ష్మి వెనక్కి పడిపోయారు. తలకు తీవ్ర గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందారు. ఇదే రహదారిపై నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని, గడిచిన అయిదేళ్లలో కనీసం రహదారిపై గుంతలు పూడ్చలేదని స్థానికులు పేర్కొన్నారు.

పల్లె పండగకు వేళాయె..

రూ.81.22 కోట్లతో 857 అభివృద్ధి పనులకు శంకుస్థాపన

దసరా పండగ ముగిసింది. ఇక పల్లె పండగ మొదలవుతోంది. జిల్లాలో సోమవారం నుంచి ఈ నెల 20 వరకు వారంపాటు పల్లె పండగ వారోత్సవాల నిర్వహణకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. వారోత్సవాల్లో భాగంగా ఆయా గ్రామ పంచాయతీల్లో మౌలిక సదుపాయాల కల్పన పనులకు ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా శ్రీకారం చుట్టనున్నారు.



న్యూస్‌టుడే, కాకినాడ కలెక్టరేట్

కూటమి ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి నడుం బిగించింది. వైకాపా హయాంలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైన పల్లెల్లో అభివృద్ధికి బాటలు వేస్తోంది. ఆగస్టు 23న ఒకే రోజు జిల్లాలోని 385 పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహించి, రూ.290 కోట్ల విలువైన 2,913 సీసీ రోడ్లు నిర్మించాలని తీర్మానించారు. దీనిలో భాగంగా తొలి దశలో రూ.81.22 కోట్లతో 857 సీసీ రోడ్ల నిర్మాణానికి సంకల్పించారు. 2024-25కు సంబంధించి ఉపాధి హామీ పథకం ద్వారా సమకూర్చే మెటీరియల్ కాంపొనెంట్ నిధులతో ఈ పనులు చేపట్టాలని నిర్ణయించారు. రానున్న నాలుగేళ్లలో నిర్దేశించిన విధంగా మొత్తం సీసీ రోడ్ల నిర్మాణానికి ప్రణాళికలు తయారు చేశారు.

వైకాపా హయాంలో నిధులు మళ్లించి..

వైకాపా హయాంలో జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా సమకూరిన రూ.కోట్ల నిధులు భవన నిర్మాణాలకు మళ్లించారు. అయిదేళ్లలో కనీసం 50 శాతం భవనాలనూ అందుబాటులోకి తేలేకపోయారు. కూటమి ప్రభుత్వం వచ్చాక.. ఈ నిధులను గ్రామాల్లో సీసీ రహదారులు, కాలువల నిర్మాణానికి కేటాయించి, అభివృద్ధికి బాటలు వేస్తోంది. దీని కోసం ఈనెల 14 నుంచి 21 వరకు గ్రామ పంచాయతీల్లో వారోత్సవాల పేరుతో పల్లె పండగ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

మండలంలో ఒకచోట

తొలిరోజు సోమవారం ప్రతీ మండలంలో ఒకచోట అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసేలా ఏర్పాట్లు చేశారు. ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు తొలిరోజు ఏదో ఒకచోట సీసీ రోడ్లు, సీసీ రోడ్ కం డ్రెయిన్ పనులకు శంకుస్థాపన చేస్తారు. మంగళవారం నుంచి విస్తృతంగా శంకుస్థాపనల కార్యక్రమాలను నిర్ణయించి, ఎమ్మెల్యేల వారీగా కలెక్టరేట్‌కు షెడ్యూల్‌ను పంపించారు. ఈ వారోత్సవాల ప్రారంభానికి మంత్రులు ఎవరూ పాల్గొనడం లేదు. పంచాయతీరాజ్, గ్రామ పంచాయతీ, డ్వామా విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో పల్లె పండగను విజయవంతం చేసేలా కార్యాచరణ అమలు చేయనున్నట్లు డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి 'న్యూస్‌టుడే'కు చెప్పారు. ఆమె పిఠాపురం నియోజకవర్గంలో జరిగే కార్యక్రమంలో పాల్గొంటారు.

నేడు కలెక్టరేట్‌లో వినతుల స్వీకరణ రద్దు

కాకినాడ కలెక్టరేట్: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించాల్సిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ(వినతుల స్వీకరణ) కార్యక్రమాన్ని వివిధ కారణాలతో రద్దు చేసినట్లు కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు.

పట్టుకున్న బియ్యం విడుదల

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: కాకినాడ పోర్టు, పరిసర ప్రాంతాల్లో పౌరసరఫరాల శాఖ పట్టుకున్న రేషన్ బియ్యం విడుదలకు చర్యలు చేపట్టారు. పోర్టు నుంచి గత వైకాపా ప్రభుత్వంలో పెద్ద ఎత్తున రేషన్ బియ్యం విదేశాలకు తరలిపోతున్నాయన్న ఆరోపణలతో పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ కాకినాడలోని బియ్యం గోదాముల్లో తనిఖీలు చేశారు. 13 గోదాముల్లోని 25,386 టన్నుల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. 6ఏ కేసులు నమోదు చేయగా విచారణ కొనసాగుతోంది.



పట్టుకున్న బియ్యం (పాత చిత్రం)

రూ.8.73 కోట్ల విలువ..

కేసులు తేలేసరికి బియ్యం పాడైపోయే అవకాశం ఉండటంతో సదరు గోదాముల యజమానులు వీటిని విడిపించుకోడానికి ప్రయత్నాలు మొదలుపెట్టారు. బియ్యం విలువకు సమానమైన బ్యాంకు పూచీకత్తులు సమర్పించి, విడిపించుకుంటున్నారు. పట్టుకున్న 25,386 టన్నుల బియ్యం విలువ రూ.8,73,86,095 ఉంటుందని నిర్ధారించారు. ఆ ప్రకారం 13 మంది గోదాముల యజమానులు పౌరసరఫరాల శాఖకు పూచీకత్తులు సమర్పిస్తున్నారు. కేసులు తేలిన తర్వాత అక్కడ విధించే జరిమానా మినహాయించి, మిగతా సొమ్ము తిరిగి పొందుతారు.

ఇప్పటివరకు నలుగురు..

ఇప్పటికి నలుగురు పూచీకత్తులు సమర్పించారు. హెచ్ గొడౌన్ రూ.11 కోట్లు, అశోక్ ఇంటర్నేషనల్ 13.43కోట్లు, సాయితేజ షిప్పింగ్ సర్వీసెస్ రూ.99లక్షలు, సత్యం బాలాజీ రైస్ ఇండస్ట్రీ రూ.18.78కోట్ల విలువైన పూచీకత్తులు సమర్పించారు. మిగిలిన వారు అదే పనిలో ఉన్నారు. నిబంధనల ప్రకారం ప్రక్రియ జరుగుతుందని అధికారులు చెబుతున్నారు.

కమిషనర్-డీఈ బాహాబాహీపై నేడు విచారణ

పిఠాపురం: పిఠాపురం పురపాలక సంఘ కౌన్సిల్ సమావేశంలో ఆగస్టు 31న కమిషనర్ ఎన్.కనకారావు, డీఈ ఎస్.భవానీశంకర్ బాహాబాహీ ఘటన అప్పట్లో చర్చనీయాంశమైంది. అదేరోజు డీఈని సస్పెండ్ చేశారు. దీనిపై ఆయన హైకోర్టును ఆశ్రయించడంతో సస్పెన్షన్ ఉత్తర్వులు రద్దు చేయగా అక్టోబరు 1న డీఈ తిరిగి విధుల్లో చేరారు. దీనిపై విచారణకు ప్రభుత్వం సెప్టెంబరు 25న పి.పూర్ణచంద్రరావు(మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అడిషనల్ డైరెక్టర్), ఎం.బ్రహ్మాజీ(పబ్లిక్ హెల్త్ డిప్యూటీ ఇంజినీరింగ్ చీఫ్), బి.శ్రీనివాసులు(అడిషనల్ డైరెక్టర్ టౌన్ ప్లానింగ్)లతో కమిటీని నియమించింది. సోమవారం పూర్తిస్థాయి విచారణ జరగనుంది. ఆరోజు కౌన్సిల్ సమావేశంలో పాల్గొన్న సభ్యులంతా విచారణకు హాజరుకావాలని సూచించారు.

ఇక తిరుగు ప్రయాణాలు..

దసరా సెలవులు ముగిసిన నేపథ్యంలో రైల్వే స్టేషన్లు, బస్టాండులు ప్రయాణికులతో కిటకిటలాడాయి. హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడ తదితర ప్రాంతాల నుంచి జిల్లాకు వచ్చిన వారు తమ స్వస్థలాలకు ఆదివారం పయనమయ్యారు. అదేవిధంగా ఊళ్లకు వెళ్లి సొంతూరుకు తిరిగొచ్చిన వారితో రైళ్లు, బస్సులు కిక్కిరిసిపోయాయి. పండగ చివరి రెండ్రోజులు ఆర్టీసీ అధికారులు హైదరాబాద్‌కు ప్రత్యేక బస్సులను నడిపారు. కాకినాడ టౌన్ రైల్వే స్టేషన్ నుంచి సికింద్రాబాద్‌కు ప్రత్యేక రైళ్లు నడిపినట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలిపారు. - న్యూస్‌టుడే, సాంబమూర్తినగర్ (కాకినాడ)



సినీ, నిజ జీవితాల్లో సూర్యకాంతం ఆదర్శం

డబ్బింగ్ జానకికి సూర్యకాంతం జీవన సాఫల్య పురస్కారం ప్రదానం

కాకినాడ (గాంధీనగర్), న్యూస్‌టుడే: వంటల పుస్తకం రాయడంతో పాటు ఇంటికి వచ్చిన వారికి కడుపు నిండా భోజనం పెట్టిన విలక్షణ నటి సూర్యకాంతం అందరికీ ఆదర్శప్రాయురాలని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ప్రస్తుతించారు. కాకినాడలోని దంటు కళాక్షేత్రంలో ది యంగ్మెన్స్ హ్యాపీక్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి ప్రముఖ నటి సూర్యకాంతం శతజయంతి సభ నిర్వహించారు. బుద్ధప్రసాద్ మాట్లాడుతూ ఆంధ్రుల అభిమాన అత్తగా ఆమె తెలుగువారి గుండెల్లో నిలిచిపోయారని పేర్కొన్నారు. సూర్యకాంతం సినీ జీవితం, నిజ జీవితం ఆదర్శమన్నారు. ఆమె పాటలు బాగా పాడేవారన్నారు. వెంకటకృష్ణారాయపురం నుంచి యంగ్మెన్స్ హ్యాపీ క్లబ్‌కు సైకిల్‌పై వచ్చి రిహార్సల్ చేసేవారని గుర్తుచేశారు. సూర్యకాంతం కుమారుడు అనంత పద్మనాభమూర్తి మాట్లాడుతూ సొంతూరిలో తన తల్లిగారి శతజయంతి ఉత్సవాలు నిర్వహించడం, పురస్కారం ఇవ్వడం ఆమెకు అసలైన నివాళిగా పేర్కొన్నారు. క్లబ్ అధ్యక్షుడు దంటు భాస్కరరావు మాట్లాడుతూ క్లబ్ సభ్యురాలిగా సూర్యకాంతం ఇక్కడే నాటకాలు వేసి, సినీ రంగంలోకి ప్రవేశించి గొప్ప నటిగా ఎదిగారని స్మరించుకున్నారు. డబ్బింగ్ జానకికి సూర్యకాంతం జీవన సాఫల్య పురస్కారం ప్రదానం చేశారు. సీపోర్ట్స్ సీఈవో మేర్ల మురళీధర్, ప్రముఖ వైద్యుడు డాక్టర్ వాడ్రేవు రవి, ఎన్టీఆర్ కళాపరిషత్ కార్యదర్శి కె.సాంబశివరావు హాజరయ్యారు.



డబ్బింగ్ జానకికి పురస్కారాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, ప్రముఖులు

పారిశ్రామికం.. మరింత ఊతం

– న్యూస్‌టుడే, రమణయ్యపేట (సర్పవరం జంక్షన్)

సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమలకు అవసరమైన మౌలిక సదుపాయాలు, అంతర్జాతీయ ప్రమాణాలతో యంత్ర సామగ్రి, సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి తీసుకువచ్చి, నైపుణ్యాలు పెంపొందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మినిస్ట్రీ ఆఫ్ మైక్రో, స్మాల్ ఎంటర్‌ప్రైజెస్(ఎంఎస్ఎంఈ) పథకంగా దేశవ్యాప్తంగా వివిధ పరిశ్రమల క్లస్టర్ల ఏర్పాటుకు ప్రోత్సాహకాలు అందిస్తున్నాయి. జిల్లాలోనూ క్లస్టర్ అసోసియేషన్ల ఏర్పాటుకు పారిశ్రామికవేత్తలు ముందుకొస్తున్నారు.



శ్రీసత్యదేవ ప్రింటింగ్ క్లస్టర్‌లో అత్యాధునిక యంత్రాలు

తొలి క్లస్టర్ శ్రీసత్యదేవ..

కాకినాడ గ్రామీణంలోని రమణయ్యపేట ఏపీఐఐసీ పారిశ్రామిక ప్రాంతంలో కాకినాడకు చెందిన ప్రింటింగ్ ప్రెస్ యజమానులు సుమారు 60 మంది కలిసి శ్రీసత్యదేవ పేరుతో ఛైర్మన్‌గా కోరుమిల్లి బాలప్రసాద్, జే ఎండీగా గుమ్ములూరి వెంకటరమణమూర్తి మరో తొమ్మిది మంది డైరెక్టర్లుగా ప్రింటింగ్ క్లస్టర్ అసోసియేషన్ ఏర్పాటు చేశారు. ఎంఎస్ఎంఈ అధికారులు, జిల్లా పరిశ్రమలశాఖ జీఎం డైరెక్టర్లలో ఉంటూ లావాదేవీలు పర్యవేక్షిస్తూ.. తగిన సలహాలూ ఇస్తున్నారు.

మరిన్ని ప్రతిపాదనలు..

కాకినాడ పోర్టు ప్రాంతంలో సుమారు 80 మంది రైస్‌మిల్లర్లు కలిసి క్రిస్టల్ ఆగ్రోటెక్ రైస్‌మిల్స్ క్లస్టర్ ఫెడరేషన్ పేరుతో రూ.30 కోట్లతో రైస్‌మిల్లు క్లస్టర్ ఏర్పాటు చేస్తున్నారు. కేంద్ర అనుమతులకు నిరీక్షిస్తున్నారు. సర్పవరం ఆటోనగర్ క్లస్టర్, సూరంపాలెంలో పాలిమర్స్ క్లస్టర్, కాకినాడలో బంగారం, తునిలో కార్పెంటరీ క్లస్టర్‌కు ఏర్పాట్లు చేస్తున్నారు. కాకినాడ గ్రామీణంలో మామిడితాండ్ర, తునిలో జీడిపప్పు పరిశ్రమ క్లస్టర్‌కు పారిశ్రామికవేత్తలు ఉత్సాహంగా ఉన్నారు.

ప్రభుత్వాల ప్రోత్సాహం

కనీసం 20 మంది కలిసి రూ.5 కోట్ల నుంచి రూ.30 కోట్లతో క్లస్టర్లు ఏర్పాటు చేసుకోవచ్చు. మౌలిక సదుపాయాల కేంద్రం ఏర్పాటుకు రూ.5 కోట్ల నుంచి రూ.10 కోట్ల వరకు అయితే.. కేంద్రం 80, రాష్ట్రం 15 శాతం గ్రాంటు అందిస్తుంది. బృంద వాటా 5 శాతం పెట్టాల్సి ఉంటుంది. రూ.10 కోట్ల నుంచి రూ.30 కోట్ల వరకైతే.. కేంద్రం 70, రాష్ట్రం 15, క్లస్టర్ యాజమాన్యం 15శాతం పెట్టుబడి ఏర్పాటు చేయాలి. బ్యాంకు రుణాలూ అందిస్తున్నారు. త్వరలో కాకినాడలో ఎస్ఐడీబీఐ ప్రాంతీయ కార్యాలయ ప్రారంభానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఎస్ఐడీబీఐ సీజీఎం సంజయ్‌గుప్తా ఆధ్వర్యంలో బ్యాంకు ద్వారా అవుట్‌రీచ్ ప్రోగ్రామ్‌తో ఇటీవల ఔత్సాహికులకు అవగాహన కల్పించారు.

ప్రభుత్వ ఆర్డర్లతో ప్రగతి..



కోరుమిల్లి బాలప్రసాద్ ఛైర్మన్‌గా శ్రీసత్యదేవ ప్రింటింగ్ క్లస్టర్ అసోసియేషన్ ఏర్పాటుతో ప్రింటింగ్ రంగంలో విప్లవాత్మక మార్పులు వస్తున్నాయి. జపాన్ పరిజ్ఞానంతో తక్కువ ధరకు క్వాలిటీ అందిస్తున్నాం. ప్రభుత్వ ఆర్డర్లు వస్తే మరింత అభివృద్ధి జరుగుతుంది. ఇతర ప్రాంతాల నుంచీ ఆర్డర్లు వస్తున్నాయి.

- గుమ్ములూరు వెంకటరమణమూర్తి, జేఎండీ, శ్రీసత్యదేవ ప్రింటింగ్ క్లస్టర్

వెంటనే అనుమతులు..

జిల్లాలో ఎన్ని క్లస్టర్లైనా ఏర్పాటు చేసుకోవచ్చు. దరఖాస్తు చేసుకుంటే నిబంధనల ప్రకారం వెంటనే అనుమతులిస్తున్నాం. ప్రభుత్వ రాయితీలు ఉపయోగించుకోవచ్చు. సాంకేతిక పరికరాలను ఓపెన్ టెండర్ ద్వారా సమకూర్చుతా. జిల్లా పరిశ్రమలశాఖ అధికారి ఒక డైరెక్టర్‌గా పర్యవేక్షిస్తారు.

- చెట్టి గణపతి, జేడీ, జిల్లా పరిశ్రమల కేంద్రం

'ఏలేరు'లో ఇసుక దొంగలు



ఏలేరు కాలువలో ఇసుక అక్రమ తవ్వకాలు



ట్రాక్టర్లతో తరలింపు

కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక విధానం ప్రకటించడంతో ఇకపై కష్టాలు తీరనున్నాయని అంతా హర్షం వ్యక్తం చేశారు. కొంతమంది అక్రమార్కుల కారణంగా ఉచిత ఇసుక విధానానికి తూట్లు పడుతున్నాయి. కాకినాడ జిల్లాలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఏలేరుకు వరదలు వచ్చాయి. ఈ క్రమంలో ఇసుక దొరకడం కొంత కష్టమవ్వడంతో బహిరంగ మార్కెట్‌లో గిరాకీ పెరిగింది. ఇదే అక్రమార్కుల పాలిట వరంగా మారింది. జగ్గంపేట మండలం మామిడాడ సమీపంలోని ఏలేరు కాలువలో అక్రమంగా ఇసుక తవ్వేస్తున్నారు. 10 అడుగుల లోతులోని ఇసుకను కూలీలతో ప్రమాదకరంగా తోడిస్తున్నారు. దాన్ని ఎవరికీ తెలియకుండా ట్రాక్టర్లలో తరలిస్తున్నారు. స్థానిక అధికారులు వీటికి అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.

- ఈనాడు, కాకినాడ, న్యూస్‌టుడే, జగ్గంపేట గ్రామీణం



శరణు దుర్గా.. శరణు..

దసరా ఉత్సవాలు వైభవంగా ముగిశాయి. దేవీ శరన్నవరాత్రుల్లో అమ్మవార్లకు ప్రత్యేకపూజలు నిర్వహించగా భక్తులు వేడుకలు ముగిసిన సందర్భంగా దీక్షలు విరమించారు. శమీ వృక్షానికి పూజలు చేశారు. ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల్లోని ఆలయాలు, బహిరంగ వేదికలపై తొమ్మిది రోజుల పాటు కొలువుదీరిన అమ్మవార్లకు భక్తులు శక్తికొలదీ నైవేద్యాలు సమర్పించి దీవెనలందించాలని వేడుకున్నారు. ఉత్సవాలు ముగిసిన సందర్భంగా పలు ప్రాంతాల్లో అన్నదానాలు ఏర్పాటు చేశారు.

– న్యూస్‌టుడే, బృందం



కాకినాడ సంతచెరువు కనకదుర్గ ఆలయంలో వేంకటేశ్వరస్వామి అవతారంలో అమ్మవారు


తుని: వాసవీమాతగా...


అన్నవరం: వనదుర్గ


తులుపులమ్మ లోవలో రాజరాజేశ్వరిగా..


ఐశ్వర్యాంబిక అమ్మవారికి హారతి ఇస్తున్న స్వామి పరిపూర్ణానంద సరస్వతి


కరపలోని హంస ప్రతిమకు విద్యుద్దీపాలంకరణ

వేడుకగా రావణ సంహారం

అన్నవరం, న్యూస్‌టుడే: అన్నవరంలో రావణ సంహార కార్యక్రమం వేడుకగా శనివారం జరిగింది. కొండ దిగువన జూనియర్ కళాశాల ప్రాంగణంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. మందుగుండు సామగ్రితో తీర్చిదిద్దిన రావణ బొమ్మను దగ్ధం చేశారు. విద్యుత్తు దీపాలంకరణ, బాణాసంచా మెరుపులు భక్తులను ఆకట్టుకున్నాయి. అధికారులు భద్రతా ఏర్పాట్లు పకడ్బందీగా చేశారు.


అన్నవరంలో బాణసంచాతో తీర్చిదిద్దిన రావణాసురుడి బొమ్మ

కనులపండువగా తెప్పోత్సవం

పిఠాపురం, న్యూస్‌టుడే: పిఠాపురం పాదగయ క్షేత్రంలో దసరా ఉత్సవాల ముగింపు సందర్భంగా కుక్కుటేశ్వరస్వామి, రాజరాజేశ్వరి అమ్మవార్ల తెప్పోత్సవం కనుల పండువగా సాగింది. శనివారం రాత్రి పాదగయ పుష్కరిణిలో హంస వాహనంపై తెప్పోత్సవం నిర్వహించారు. ఈవో విశ్వనాథరావు తదితరులు పాల్గొన్నారు. పాదగయ క్షేత్రాన్ని కాకినాడ జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ సందర్శించారు. శనివారం ఆలయానికి వచ్చిన ఆయనకు అర్చకులు క్షేత్ర విశిష్టతను వివరించారు. అనంతరం కుక్కుటేశ్వరస్వామి, రాజరాజేశ్వరిదేవి, పురుహూతిక అమ్మవారు, దత్తాత్రేయ స్వామివార్లను ఎస్పీ దర్శించుకున్నారు. ఈవో విశ్వనాథరావు పట్టువస్త్రాలు, ప్రసాదం అందజేశారు. సీఐ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


పాదగయ పుష్కరిణిలో స్వామి, అమ్మవార్ల తెప్పోత్సవం

తపోవనంలో హోం మంత్రి పూజలు

తుని గ్రామీణం: కుమ్మరిలోవ తపోవనం ఆశ్రమంలో శనివారం రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. విజయదశమి పర్వదినం సందర్భంగా ఆశ్రమానికి వచ్చిన ఆమెకు వేదపండితులు సాదరంగా స్వాగతం పలికారు. ఆశ్రమ పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతి స్వామీజీని సందర్శించి ఫలపుష్పాలు అందజేశారు. అనంతరం ఆశ్రమంలో కొలువుదీరిన రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కూటమి నాయకులు ఉన్నారు.


పీఠాధిపతికి ఫలపుష్పాలు అందిస్తున్న రాష్ట్ర హోం మంత్రి అనిత

కాల్‌మనీ కేటుగాళ్లు



అధిక వడ్డీల వడ్డింపు.. చెల్లించకుంటే వేధింపులు

మండపేట పరిసర ప్రాంతాల్లో వేలల్లో అప్పులిచ్చి.. అవి తీరిపోయినా ఇంకా చెల్లించాలంటూ వేధింపులకు గురిచేస్తున్న ఘటనలు పెరిగిపోతున్నాయి. ఏళ్లుగా గుట్టుగా సాగుతున్న ఈ వ్యవహారం.. గత సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక సందర్భంగా మండపేట విచ్చేసిన జిల్లా కలెక్టర్‌కు బాధితులు ఫిర్యాదు చేయడంతో వెలుగులోకి వచ్చింది. చిన్నచిన్న వ్యాపారాలు చేసి జీవనం సాగించే వారు అవసరార్థం చేబదులుగా వడ్డీ వ్యాపారుల వద్ద అప్పులు తీసుకున్నారు. అడిగిన వెంటనే అప్పు దొరుకుతుండటంతో దస్తావేజులు తనఖా పెట్టి.. ఖాళీ ప్రామిసరీ నోట్లపై సంతకాలు చేసి నగదు తీసుకుంటున్నారు. నెలనెలా సక్రమంగా వడ్డీ చెల్లించి, కొంత అప్పు తీరిన తరువాత వ్యాపారులు కోర్టు నోటీసులు ఇస్తున్నారు. తాము పొందిన రుణానికి అయిదారు రెట్లు నగదు చెల్లించాలంటూ ఆ నోటీసుల్లో పేర్కొనడంతో ఎవరికి చెప్పాలో పాలుపోక మానసిక వేదనకు గురవుతున్నారు. ఇటీవల ఒక కుటుంబం తల్లిదండ్రులతోపాటు ఇద్దరు కుమారులు వారణాసిలో ఆత్మహత్యకు పాల్పడిన సంఘటనకు ఈ కాల్‌మనీ వ్యవహారమే కారణమని స్థానికంగా చర్చ జరుగుతోంది.

రూ.వేలల్లో అప్పులిస్తారు.. వడ్డీ మీద వడ్డీలు వేసి రూ.లక్షలు, రూ.కోట్లు చెల్లించాలని వేధిస్తారు. కుదరదంటే కోర్టు నోటీసులు పంపిస్తారు. ఇదీ జిల్లాలోని పెరిగిపోతున్న కాల్‌మనీ దందా. వేధింపులు భరించలేక పోతున్నాం బాబోయ్ అంటూ బాధితులు జిల్లా యంత్రాంగాన్ని ఆశ్రయిస్తున్నారు.

– న్యూస్‌టుడే, మండపేట

రాజకీయ పలుకుబడితో బెదిరింపు

అప్పు పుట్టిందన్న సంతోషంలో ఎటువంటి ఆధారాలు తమ వద్ద ఉంచుకోకపోవడం బాధితులకు ఇబ్బందిగా మారింది. ఈవిధంగా మండపేట పరిసర ప్రాంతాల్లో 75 మంది వరకు బాధితులు ఉండొచ్చని అంచనా. నలుగురు వ్యాపారులు వీరిని వేధింపులకు గురిచేస్తున్నారు. అడిగినంత నగదు చెల్లించకపోతే రాజకీయ పలుకుబడి ఉపయోగించి ఇళ్లకు వచ్చి బెదిరింపులకు పాల్పడుతున్నట్లు బాధితులు వాపోతున్నారు.

రూ.20 వేలకు రూ.2.50 లక్షలు ఇమ్మంటున్నారు..

చిన్న వ్యాపారం చేస్తున్నా. రెండేళ్ల క్రితం దస్తావేజులపై రూ.20 వేలు తీసుకుని రోజుకు రూ.300 వడ్డీతో పూర్తిగా చెల్లించా. దస్తావేజులు అడిగితే ఇవ్వకుండా సంవత్సరం పోయాక రూ.2.50 లక్షలు ఇవ్వాలంటూ కోర్టులో కేసు వేశారు.



- ప్రసాద్, బాధితుడు, మండపేట

నెలకు రూ.4 వేలు వడ్డీ..

సంవత్సరం క్రితం వేములపల్లి జగనన్న లేఅవుట్‌కు సంబంధించిన దస్తావేజు ష్యూరిటీగా పెట్టి మా అమ్మ వరలక్ష్మి రూ.70 వేలు తీసుకున్నారు. ప్రతి నెలా రూ.4 వేలు వడ్డీ చెల్లించాం. పనుల్లేక కొంతకాలం వడ్డీ చెల్లించలేదు. తరువాత దస్తావేజుల కావాలంటే రూ.2.20 లక్షలు కట్టాలన్నారు.



- శ్రీను, బాధితుడు

పరిశీలించి చర్యలు

బాధితులు ఇచ్చిన ఫిర్యాదులన్నీ కోర్టుల పరిధిలో ఉన్నాయి. ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదు. పూర్తిగా విచారణ చేసి తగిన చర్యలు తీసుకోవాలని ఎస్సైకి ఆదేశాలు జారీ చేశాం. నివేదికనుబట్టి మా పరిధిలోని అంశాలు పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటాం.

- దొరరాజు, సీఐ, మండపేట రూరల్

రూ.కోటి చెల్లించమంటున్నారు..

2014లో వ్యాపార అవసరాల కోసం రూ.5 లక్షలు అప్పు తీసుకున్నా. 2016లో పూర్తిగా చెల్లిద్దామని ప్రామిసరీ నోటు ఇమ్మని అడిగితే.. అప్పటికే తీసుకున్న అప్పుపై రూ.32 లక్షలు చెల్లించాల్సి ఉందన్నారు. ప్రస్తుతం రూ.1.05 కోట్లు చెల్లించాలంటూ కేసు వేశారు. ఏం చేయాలో పాలుపోవడం లేదు.



- ఎం.రామ్‌రహీమ్

ఫిర్యాదు చేసినా కేసు నమోదు చేయలేదు..

గతంలో ఓ వ్యాపారి వద్ద రూ.60 వేలు అప్పు తీసుకుని రూ.30 వేలు చెల్లించా. ఇంకా రూ.6 లక్షలు ఇవ్వాలంటూ కోర్టు నోటీసులు ఇచ్చారు. బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆగస్టులో పోలీసులకు ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేసేందుకు నిరాకరించారు.



- దంగేటి దుర్గాప్రసాద్

బాస్కెట్‌బాల్ విజేత జిల్లా జట్లు

రామచంద్రపురం, న్యూస్‌టుడే: రామచంద్రపురం కృత్తివెంటి పేర్రాజు పంతులు ప్రభుత్వ జాతీయ జూనియర్ కళాశాల క్రీడా ప్రాంగణంలో లోక్‌సభ దివంగత స్పీకర్ జీఎంసీ బాలయోగి జ్ఞాపకార్థం నిర్వహించిన 9వ రాష్ట్రస్థాయి (అంతర్ జిల్లాల) సబ్ జూనియర్స్ బాస్కెట్‌బాల్ పోటీల్లో తూర్పుగోదావరి జిల్లా బాల, బాలికల జట్లు విజేతగా నిలిచాయి. మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఈ పోటీలు ఆదివారంతో ముగిశాయి. అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాథుర్ పాల్గొని విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. తన తండ్రి జీఎంసీ బాలయోగి పేరిట అమలాపురంలో నిర్మిస్తున్న అంతర్జాతీయ స్టేడియంను త్వరలో ప్రారంభించనున్నట్లు తెలిపారు. రామచంద్రపురంలో రెండో సింథటిక్ బాస్కెట్‌బాల్ కోర్టును అభివృద్ధి చేసేందుకు నిధులు ఇస్తామన్నారు. బాస్కెట్‌బాల్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్నమని చక్రవర్తి, జిల్లా, రాష్ట్ర బాస్కెట్‌బాల్ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.


బాలికల జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న ఎంపీ హరీష్‌మాథుర్

పోరాట యోధుడు సాయిబాబా

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: మానవ హక్కుల ఉద్యమకారుడు, దిల్లీ వర్సిటీ మాజీ ప్రొఫెసర్ జి.ఎన్.సాయిబాబా మృతితో ఆయన స్వస్థలం అమలాపురంలో విషాదం అలముకుంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం మండలం నల్లమిల్లిలో పుట్టిన ఆయన భవితకు పునాది ఇక్కడే పడింది. ఇక్కడ చదువుతున్న రోజుల నుంచే పేదలకు సాయం చేయాలని తపించేవారు. అనంతరం హక్కుల పోరాటం కోసం పోరాటం చేశారు. ఆయన మృతికి పలువురు సంతాపం తెలిపారు.


అమలాపురంలోని గడియారస్తంభం ప్రాంగణంలో నినాదాలు చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

- ఆదివాసీలు, పీడిత ప్రజల కోసం మేధావులతో కలసి ఉద్యమాలు చేసిన ప్రొఫెసర్ సాయిబాబా పోరాట యోధుడని పౌరహక్కుల, ప్రజాసంఘ నాయకులు కొనియాడారు. సాయిబాబా మృతి పట్ల అమలాపురంలోని గడియారస్తంభం ప్రాంగణంలో ఆదివారం సంతాప సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన బంధువు గంగుమళ్ల శ్రీనివాసరావు మాట్లాడుతూ సాయిబాబా పేదల పక్షాన పోరాడారన్నారు. మావోయిస్టులతో సంబంధాలున్నాయనే ఆరోపణలతో జైలులో పెట్టినా నిర్దోషిగా విడుదలయ్యారన్నారు. ఇంతలోనే తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ కన్నుమూయడం బాధాకరమన్నారు. సీపీఎం జిల్లా కన్వీనర్ కె.సత్తిబాబు మాట్లాడుతూ అంగవైకల్యం ఉన్నా ఉద్యమాల బాట పట్టారన్నారు. ఆయనను అన్యాయంగా జైలులో పెట్టి మరణించేలా చేశారన్నారు. ఆయన ఆశయాలు కొనసాగిస్తామంటూ గడియారం స్తంభం ప్రాంగణంలో నినాదాలు చేశారు. కార్యక్రమంలో జిల్లెల మనోహర్, బాబురావు, ఇక్బాల్ రాజేష్, త్రిమూర్తులు, జి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రోడ్డు వేస్తారా.. గోడ కట్టుకోమంటారా..?

ఏలేశ్వరం: ఏలేశ్వరం మండలం రమణయ్యపేట నుంచి జె.అన్నవరం వరకు ఉన్న ర.భ.శాఖ రహదారి ప్రమాదాలకు నిలయంగా మారిందని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి కొసిరెడ్డి గణేష్ అన్నారు. రహదారిని వెంటనే పునఃనిర్మించాలని కోరుతూ ఆదివారం ఏలేశ్వరం వినోద్‌మిశ్రా నగర్‌లో స్థానికులు ఆందోళన నిర్వహించారు. ప్లకార్డులు చేతపట్టి రోడ్డు దుస్థితిపై అధికారులు స్పందించాలని నినాదాలిచ్చారు. గణేష్ మాట్లాడుతూ.. రహదారి నిర్మాణానికి గత వైకాపా ప్రభుత్వంలో రూ.20 కోట్లు మంజూరయ్యాయని, ఐదేళ్లు గడిచినా పనులు పూర్తి కాకపోవడంతో ప్రయాణికులు రోజూ అవస్థలు పడుతున్నారన్నారు. గుత్తేదారుకు చెల్లించిన బిల్లుపై అనుమానాలు ఉన్నాయని, విచారణ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. వచ్చే నెల నాలుగు లోపు రోడ్డు పనులు ప్రారంభించకుంటే అడ్డుగా గోడ కట్టేస్తామని ఆయన హెచ్చరించారు.


ఏలేశ్వరంలో కరపత్రాలు పట్టుకుని స్థానికుల నిరసన

ఐకమత్యంతోనే సమస్యలు పరిష్కారం

సాంబమూర్తినగర్, కాకినాడ నగరం న్యూస్‌టుడే: ఐక్యమత్యంతోనే అన్ని సమస్యలు పరిష్కారం అవుతాయని మహాసేన రాజేష్ పేర్కొన్నారు. స్థానిక అంబేడ్కర్ భవన్‌లో శనివారం ఉమ్మడి జిల్లా స్థాయి మాలల ఐక్యత సభను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మహాసేన రాజేష్ హాజరై మాట్లాడారు. ఎస్సీల రిజర్వేషన్ల పరిరక్షణ, మత స్వేచ్ఛ ఐక్యం కావాలన్నారు. ఎస్సీ రిజర్వేషన్లను విడగొట్టి మాలలకు రాజ్యాధికారాన్ని దూరం చేసేందుకు కొన్ని శక్తులు కుట్ర చేస్తున్నాయన్నారు. మాలల రిజర్వేషన్లు పెంచాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. అందుకు అన్ని రాజకీయ పక్షాలు సహకరించాలన్నారు. దళిత సత్తా రాష్ట్ర అధ్యక్షుడు బచ్చల కామేశ్వరరావు మాట్లాడుతూ దళితులు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా ఎదిగేందుకు రిజర్వేషన్లు ఉపయోగపడతాయన్నారు. బీమ్ ఆర్మీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లి శివకుమార్ మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయ సాధనకు ఏకం కావాలన్నారు. జిల్లా తెదేపా ఎస్సీ సెల్ అధ్యక్షులు కొల్లాబత్తుల అప్పారావు మాట్లాడుతూ రిజర్వేషన్లతో ఎస్సీలు అన్ని విధాలా అభివృద్ధి చెందుతున్నారన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా మాల నాయకులు జంగా బాబూరావు, ఖండవల్లి లోవరాజు, కుంచే శ్రీహరి, నక్కా చిట్టిబాబు, యాదల సత్యనారాయణ, రేవు సుబ్బారావు, బచ్చల రాజేష్ తదితరులు పాల్గొన్నారు.


మాలల ఐక్యత సభలో మహాసేన రాజేష్, నాయకులు

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి కురిడీ (వెయ్యింటికి):	11,500
పాతకాయ: గండేరా	17,500
గటగట	15,500
కొత్తకాయ: గండేరా	16,500
గటగట	14,500
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముక్కుడు) కాయ	14,000-15,000
కొత్త (పచ్చి) కాయ	13,500-14,000
కొబ్బరినూనె మార్కెట్:	
15 కిలోలు	3,750
కిలో	260

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారంరేటు	135-00
రిటైల్ లైవ్	157-00
డ్రెస్డ్	228-00
స్కిన్‌లెస్	259-00

ఆదమరిచేలా చేసి.. దోచేసి..

అయిదుగురు అంతర్ జిల్లాల నేరస్థులు అరెస్టు

గండేపల్లి, న్యూస్‌టుడే: సాధారణ ప్రయాణికుల్లా ఆటోలు, బస్సులు ఎక్కుతారు.. పక్కనున్న వారిని ఆదమరిచేలా చేస్తారు. అనంతరం బంగారు ఆభరణాలు, నగదు, సెల్‌ఫోన్, విలువైన వస్తువులు దోచుకుంటారు. ఇలాంటి చోరీల్లో ఆ మహిళలు ఆరితేరితే వారికి సహాయకుడిగా మరో వ్యక్తి ఉన్నారు. కాకినాడ జిల్లా ఏలేశ్వరం మండలంలో చోరీ చేస్తూ దొరికిపోయిన మహిళను అదుపులోకి తీసుకుని పోలీసులు విచారణ చేయడంతో ముఠా గుట్టురట్టయింది. అంతర్ జిల్లాలకు చెందిన నలుగురు మహిళలు, ఒక వ్యక్తిని పట్టుకుని వారి నుంచి విలువైన బంగారు ఆభరణాలు, నగదు స్వాధీనం చేసుకున్నట్లు జగ్గంపేట సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ ఆదివారం తెలిపారు. విశాఖపట్నానికి చెందిన మహిళ ఈనెల 7వ తేదీన పిల్లలతో కలిసి ఏలేశ్వరంలోని తన అక్క ఇంటికి వచ్చారు. అనంతరం ఆమె ఆటో ఎక్కి మురారి గ్రామంలోని అమ్మమ్మ ఇంటికి వెళ్తుండగా అదే ఆటోఎక్కిన మరో మహిళ ఈమెతో మాటలు కలిపి బ్యాగ్‌లోని బంగారు వస్తువులను దోచుకుంది. దీనిపై ఈనెల 11న గండేపల్లి పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. దర్యాప్తులో భాగంగా చోరీకి పాల్పడిన అనకాపల్లి జిల్లా మాడుగులకు చెందిన రావుల దుర్గ (40)తో పాటు అదే ప్రాంతానికి చెందిన మెరకనపల్లి వెంకటేశ్వరరావు (50), విజయనగరం జిల్లా కొత్తవలసకు చెందిన గంటా రేవతి (25), అనకాపల్లి జిల్లా కె.కోటపాడుకు చెందిన రావుల వసంత, గోకవరం డ్రైవర్స్‌కాలనీకి చెందిన నాగులూరి శివపార్వతి (30)ని పోలీసులు అరెస్టు చేశారు. వీరి నుంచి రూ.5 లక్షల విలువైన 100 గ్రాముల బంగారు ఆభరణాలు, కారు, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. వీరు గతంలో విశాఖ, గుంటూరు, కాకినాడ, రాజమహేంద్రవరం, నెల్లూరులో చోరీలకు పాల్పడినట్లు విచారణలో వెల్లడైంది. గండేపల్లి ఎస్సై శివనాగబాబు, ఏఎస్సై శేఖర్, సిబ్బంది వీరబాబు, సూరిబాబు, బాషా ఉన్నారు.


పోలీసులు స్వాధీనం చేసుకున్న బంగారు అభరణాలు, చరవాణులు

భార్య వేధింపులతో భర్త ఆత్మహత్యాయత్నం

మసీదుసెంటర్(కాకినాడ): భార్య వేధింపులకు తోడు అత్తమామలు, బావమరిది వేధింపులతో ఒకరు ఆత్మహత్యాయత్నం చేసుకున్న ఘటన కాకినాడలో శనివారం చోటుచేసుకుంది. ఈ ఘటన స్థానికంగా సంచలనమైంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. కాకినాడకు చెందిన ఓ యువకుడికి 2022లో వివాహమైంది. తొలుత అప్పుడప్పుడు గొడవలు జరిగేవి. పిల్లలు పుట్టకపోవడంతో తరచూ జరిగేవి. 2023లో పోలీసులను ఆశ్రయించగా వారు సర్దిచెప్పి పంపించారు. ఆ తర్వాత నుంచి అతనిపై భార్య, అత్తింటి వారు మరింత కక్ష పెంచుకుని వేధించసాగారు. బాధితుడి మేనల్లుడిని సైతం వేధించసాగారు. వేధింపులు తాళలేక మనస్తాపం చెంది, లేఖ రాసి ఆత్మహత్యాయత్నం చేసుకున్నారు. ప్రస్తుతం జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు.

యువకుడి మృతితో ఆందోళన

సామర్లకోట గ్రామీణం, న్యూస్‌టుడే: సామర్లకోట గ్రామీణం పరిధిలోని పవర కూడలి సమీపంలో భవనం వద్ద పెయింటింగ్ పనులు చేస్తూ పడిపోయి పిఠాపురం రథాలపేటకు చెందిన ఇద్దరు యువకులు కొమ్ము నాని, కందికట్ల మోహన్‌కుమార్ తీవ్ర గాయాలపాలయ్యారు. వారిద్దరినీ సమీప ప్రైవేటు ఆసుపత్రిలో చేర్చారు. ఘటనపై సామర్లకోట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా వీరిలో కొమ్ము నాని(25) చికిత్సపొందుతూ ఆదివారం మృతి చెందాడు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలంటూ మృతుడి బంధువులు పనులు చేసిన భవనం వద్ద మృతదేహంతో ధర్నా చేశారు. ఇరువర్గాల చర్చల అనంతరం మృతుడి కుటుంబానికి, ఆసుపత్రిలో చికిత్సపొందుతున్న వ్యక్తికి ఆర్థిక సాయం అందించేందుకు ముందుకు రావడంతో ఆందోళన విరమించారు.


పవరలో మృతదేహంతో నిరసన తెలుపుతున్న బంధువులు

కాకినాడ

నగరంలో సినిమాలు

గాంధీనగర్, న్యూస్‌టుడే: ఆనంద్ సినిమాస్ 4ప్లెక్స్- విశ్వం, వెట్టయాన్ ది హంటర్, దేవర పార్ట్ 1, జనక అయితేగనక, సత్యసుందరం, దేవీ మల్టీప్లెక్స్ 4ప్లెక్స్- వెట్టయాన్ ది హంటర్, దేవర పార్ట్ 1, మానాన్న సూపర్‌హీరో, లక్ష్మీ- దేవర పార్ట్ 1, సత్యగౌరి- మానాన్న సూపర్‌హీరో, తిరుమల - వెట్టయాన్ ది హంటర్, సిఅండ్‌సీ 1- జనక అయితేగనక, సిఅండ్‌సీ 2- శ్వాగ్, శ్రీప్రియ - మార్టిన్, పద్మప్రియ- దేవర పార్ట్ 1, సూర్య1(వాకలపూడి) - దేవర పార్ట్ 1, సూర్య 2- విశ్వం, శ్రీశ్రీనివాస(వేళంగి)- విశ్వం.

రైతుబజార్‌లో నిన్నటి కూరగాయల ధరలు(కిలో/కు)



గాంధీనగర్, న్యూస్‌టుడే: టమాటా - 34, వంకాయలు - 54,66, బెండకాయలు - 26, పచ్చిమిర్చి - 40,55, కాకరకాయ - 35, బీర - 34,44, కాలీఫ్లవర్ - 15,20, క్యాబేజీ - 40, క్యారెట్ - 40, దొండకాయలు - 25, బంగాళాదుంపలు - 30,35, ఉల్లి - 45,50, గోరుచిక్కుళ్లు - 34, దోసకాయలు - 36, ఆనపకాయ - 40, పొట్లకాయ - 18,20, అరటికాయ - 6,7, చిక్కుళ్లు - 100, చేమదుంపలు - 30,40, మునగకాడలు - 8,10, బీట్‌రూట్ - 34, కీరదోస - 26, బీన్స్‌గింజలు - 130, అల్లం - 54, క్యాప్సికం - 88, బొబ్బర్లు - 50, చిలకడదుంపలు - 40, నిమ్మకాయలు(డజన్) - 24,54.

సాంబమూర్తినగర్‌పై శీతకన్ను



కాలనీలోని కాలువ దుస్థితి

సాంబమూర్తినగర్, మసీదు సెంటర్, న్యూస్‌టుడే: కాకినాడ నగర నడిబొడ్డున ఉన్న 13వ డివిజన్ సాంబమూర్తి నగర్‌లోని ప్రజలు అనేక సమస్యలతో సతమతం అవుతున్నారు. ఇరుకైన ప్రధాన రహదారులు, ఆరు చిన్న వీధులున్న ఈ ప్రాంతంలో సుమారు నాలుగు వేల జనాభా ఉంటోంది. నాణ్యంగా రోడ్లు, కాలువలు నిర్మించినప్పటికీ వర్షాకాలంలో ముంపునకు గురవుతోంది. సరైన అవుట్‌లెట్ లేకపోవడంతో భారీ వర్షాలకు ప్రధాన కాలువ నిండిపోయి మురుగంతా రహదారులపైకి చేరుతోంది. గతంలో ముంపు సమస్య తీవ్రంగా ఉండేదని, ఇటీవల కొన్ని వీధుల్లో కాలువల నిర్మించడం సమస్య కొంతవరకు తీరిందని స్థానికులు చెబుతున్నారు. తరచూ ఈ ప్రాంతంలో పైపులైన్ లీకేజీల కారణంగా నీరు కలుషితం అవుతోందని, ఒక్కోసారి పూర్తిగా రంగు మారి రావడం, దుర్వాసన వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వెలవెలబోతోంది.. పట్టించుకోవాలి..



డాల్ఫిన్ కాలనీలోని ఉద్యానం

ఇక్కడ మూడు ఉద్యానాలు ఉన్నా వసతులు అంతంత మాత్రంగానే ఉన్నాయి. డాల్ఫిన్ కాలనీలోని చిన్నారుల ఉద్యానాన్ని వైకాపా ప్రభుత్వ హయాంలో అభివృద్ధి చేశారు. నిర్వహణకు నోచుకోకపోవడంతో కొద్ది కాలానికే కళా విహీనంగా మారింది. నడక దారిలోని పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలు పెరిగిపోయాయి. ఊయల, ఆట పరికరాలు శిథిలయ్యాయి. చీకటి పడితే ఆకతాయిలు ఉద్యానంలోకి వస్తున్నారు. మద్యం తాగి, అక్కడే వ్యర్థాలు పడేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

చదును పేరుతో చెత్త పనులు



గతంలో వ్యర్థాలతో నింపిన విద్యాలయం మైదానం

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఎంఎస్ఎన్ ఛారిటీస్.. కాకినాడ నగరంలో చారిత్రక విద్యా సంస్థ. పేద విద్యార్థుల చదువుల కోసం మహాదాత మల్లాడి సత్యలింగ నాయకర్ అందించిన వరప్రదాయిని. ఈ విద్యాసంస్థ మైదానాన్ని అభివృద్ధి చేస్తామని గత ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి హామీ ఇచ్చారు. వ్యర్థాలతో కూడిన మట్టితో పూడ్చించే పనులు చేపట్టారు. ఏళ్ల తరబడి భూమిలో ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలతో కూడిన మట్టిని మైదానంలో నింపి, చదును పనులకు పూనుకున్నారు. వేలమంది విద్యార్థులు ఉన్నచోట ఇటువంటి మట్టితో మైదానం హానికరమని, ఎంఎస్ఎన్ ఛారిటీస్ విద్యాలయం పూర్వ విద్యార్థులు హైకోర్టును ఆశ్రయించారు. పనులు నిలిపేయాలని కోర్టు ఉత్తర్వులిచ్చినా వారు వెనక్కి తగ్గలేదు. దీంతో పూర్వ విద్యార్థులు మళ్లీ కోర్టును ఆశ్రయించడంతో అప్పటి కలెక్టర్, మున్సిపల్ కమిషనర్లకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. యుద్ధప్రాతిపదికన మైదానంలో పూడ్చిన వ్యర్థాలు తొలగించారు. వ్యర్థాల మట్టి నింపేందుకు గాను వైకాపా నేతలు నగరపాలక సంస్థకు రూ.70లక్షలు వరకు బిల్లులు పెట్టారని అప్పట్లో ప్రచారం జరిగింది. లేదు అదంతా తమ సొంత నిధులతోనే చేయిస్తున్నానని సదరు ప్రజాప్రతినిధి చెప్పడం గమనార్హం.

అభివృద్ధికి కూటమి అడుగులు..

వ్యర్థాలతో పనులు చేపట్టడాన్ని ప్రస్తుత ఎమ్మెల్యే వనమాడి కొండబాబు అప్పట్లో తీవ్రంగా వ్యతిరేకించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే నిధులు తెచ్చి తాను చదువుకున్న ఈ విద్యాలయంలోని మైదానాన్ని అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన మాట ప్రకారం కాకినాడ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(కుడా)కు ప్రతిపాదనలు పంపగా, నిధులు మంజూరయ్యాయి. త్వరలో పనులు చేపట్టనున్నారు.

రూ.1.20 కోట్లు కేటాయింపు..

ఎంఎస్ఎన్ ఛారిటీస్ విద్యాలయంలో మైదానం అభివృద్ధికి రూ.1.20కోట్లు కేటాయించారు. కుడా పాలకవర్గం ఈ నిధులను విడుదల చేస్తూ పరిపాలనా ఆమోదం ఇచ్చింది. మైదానాన్ని గ్రావెల్‌తో కప్పి, చదును చేయడం, చుట్టూ నడకదారి ఏర్పాటు, సుందరీకరణ, మొక్కల పెంపకం చేపట్టనున్నారు. ఈ విద్యాలయం దేవాదాయ, ధర్మాదాయ శాఖ పరిధిలో ఉంది. ఈ శాఖ వద్ద నిధులు లేకపోవడంతో కుడా నుంచి సొమ్ములిచ్చారు. ఈ శాఖ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో పనులు చేపట్టనున్నారు. పనులు పూర్తయితే ముంపు బాధ తప్పుతుంది.

త్వరలో టెండర్లు..

ఎంఎస్ఎన్ ఛారిటీస్‌కు మంజూరు చేసిన నిధులకు సంబంధించి త్వరలో టెండర్లు పిలుస్తాం. దేవాదాయ శాఖ ఇంజినీరింగ్ విభాగం ద్వారా పనులు చేపడతారు. కుడా వీటికి బిల్లులు చెల్లిస్తుంది. నిధులు అందుబాటులో ఉన్నాయి. ఏవిధమైన ఇబ్బంది లేదు.

– రామారావు, కార్యనిర్వాహక ఇంజినీరు, కుడా

కట్టుదిట్టంగా ఏర్పాట్లు



పరిశీలిస్తున్న ఆర్డీవో మల్లిబాబు

కాకినాడ కలెక్టరేట్: కాకినాడ జిల్లాలో మద్యం దుకాణాల ఏర్పాటుకు సంబంధించి సోమవారం లాటరీ విధానంలో ఎంపిక ప్రక్రియకు కలెక్టరేట్‌లో ఏర్పాట్లు చేశారు. వివేకానంద మందిరం, వినతుల స్వీకరణ వేదికలో రెండుచోట్ల లాటరీ ప్రక్రియ నిర్వహించనున్నారు. ఏర్పాట్లను కాకినాడ ఆర్డీవో ఎస్.మల్లిబాబు అధికారులతో కలిసి శనివారం పరిశీలించారు. దరఖాస్తుదారులు ప్రత్యక్షంగా పాల్గొనేందుకు, ఇతరులు ప్రవేశించకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని సూచించారు. తాగునీరు, షామియానాలు, కుర్చీలను సరిపడా సమకూర్చాలని సూచించారు. ఆయన వెంట కాకినాడ అర్బన్ తహసీల్దారు వి.జితేంద్ర, ఎక్సైజ్ సీఐ రామ్మోహనరావు ఉన్నారు.

ఎస్టీయూ అభయ్‌తో చేయూత



ఆర్థికసాయాన్ని అందిస్తున్న జిల్లా అధ్యక్షుడు, నాయకులు

సాంబమూర్తినగర్, కాకినాడ నగరం: ఎస్టీయూ సంఘ సభ్యులకు అభయ్ పథకం అండగా నిలుస్తుందని ఎస్టీయూ కాకినాడ, బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షులు మోర్త శ్రీనివాస్, పోతంశెట్టి దొరబాబు అన్నారు. ఇటీవల మరణించిన ఎస్టీయూ పెదపూడి మండల మాజీ అధ్యక్షుడు వంగా సూర్రెడ్డి కుటుంబ సభ్యులకు అభయ్ పథకం కింద రూ.2 లక్షల ఆర్థికసాయాన్ని అందజేశారు. స్థానిక ఎస్టీయూ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. ఉపాధ్యాయ సమస్యలపై సంఘం పోరాటం చేయటంతోపాటు సభ్యుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తుందన్నారు. చిత్తశుద్ధితో పోరాటం చేస్తూనే ప్రభుత్వ విద్యారంగ అభివృద్ధికి కృషి చేస్తోందన్నారు. సంఘ నాయకులు శేరిశెట్టి సత్యనారాయణ, నేరేమిడ్డి సత్యనారాయణ, యు.శ్రీను, పాము శ్రీనివాసరావు, బోనం గంగాధర్, సిద్ధార్థ ప్రసాద్, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, పోతురాజు సాయి పాల్గొన్నారు.

న్యూరోస్టార్ ఆసుపత్రి నూతన భవనం ప్రారంభం



ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కొండబాబు

మసీదు సెంటర్ (కాకినాడ): కాకినాడలో న్యూరోస్టార్ ఆసుపత్రికి సంబంధించి నూతనంగా నిర్మించిన రెండో భవనాన్ని ఎంపీ తంగెళ్ల ఉదయ శ్రీనివాస్, నగర ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, గ్రామీణ ఎమ్మెల్యే పంతం నానాజీ, ఇతర వైద్యనిపుణులు ముఖ్యఅతిథులుగా హాజరై ఆదివారం ప్రారంభించారు. ఆసుపత్రి అధినేత డా.అశోక్‌కుమార్, ఎండీ జ్యోతుల సతీష్, డా.శాస్త్రి పాల్గొని మాట్లాడారు. నాలుగేళ్లుగా ఎన్నో రకాల మెదడు సంబంధిత శస్త్ర చికిత్సలు చేశామన్నారు. రోడ్డు ప్రమాదాలకు గురైన వారికి విజయవంతంగా శస్త్రచికిత్స నిర్వహించి ప్రాణాలు నిలిపామన్నారు. మరో భవనాన్ని ప్రారంభించడంతో 100 పడకల ఆసుపత్రిగా అవతరించిందన్నారు. అత్యాధునిక వైద్య పరికరాలతోపాటు ఆరు ఆపరేషన్ థియేటర్లు, 45 ఐసీయూ పడకలు అందుబాటులో ఉన్నాయన్నారు.

నగరంలో ముమ్మర తనిఖీలు



డ్రైవ్ నిర్వహిస్తున్న డీఎస్పీ, పోలీసులు

మసీదు సెంటర్: ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించి, మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిపై కేసులు నమోదు చేస్తున్నామని కాకినాడ డీఎస్పీ రఘువీర్ విష్ణు తెలిపారు. శనివారం రాత్రి ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. కాకినాడ నగరంలో రోజూ ఒక కూడలిలో డ్రంక్ అండ్ డ్రైవ్, వాహన తనిఖీలు, లాడ్జిల తనిఖీలు నిర్వహిస్తామన్నారు. ప్రత్యేక బృందాలతో రాత్రిపూట నగరమంతా గస్తీ తిరుగుతామన్నారు. యువత కచ్చితంగా శిరస్త్రాణం ధరించాలన్నారు. కాకినాడ పోర్టు సీఐ పి.సునీల్‌కుమార్, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సాయిబాబా మృతి తీరనిలోటు

గాంధీనగర్: ప్రముఖ విద్యావేత్త, పౌర హక్కుల నేత, ప్రొఫెసర్ జీఎన్.సాయిబాబా మృతిపై సీపీఎం జిల్లా కమిటీ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేసింది. ఈ మేరకు సీపీఎం జిల్లా కన్వీనర్ ఎం.రాజశేఖర్ ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. అమలాపురానికి చెందిన సాయిబాబా ఎస్‌కేబీఆర్ కళాశాలలో చదివారన్నారు. భౌతికంగా నడవలేని స్థితిలో చక్రాల కుర్చీకి పరిమితమైన సాయిబాబా ఉపా చట్టం కింద సుదీర్ఘకాలం జైలులో మగ్గిపోయారన్నారు. బెయిల్‌పై విడుదలైన కొన్ని నెలలకే ఇలా జరగడం దురదృష్టకరమన్నారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి..

కాకినాడ కలెక్టరేట్: సామాజిక పౌర హక్కుల యోధుడు, దిల్లీ వర్సిటీ ప్రొఫెసర్ జి.నాగసాయిబాబా మృతి ప్రజాస్వామ్య వ్యవస్థకు తీరనిలోటని కాకినాడ పౌర సంక్షేమ సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జీవితాన్ని ఎదురొడ్డి పోరాడి ఉన్నత విద్యను అభ్యసించారని అన్నారు. అనేక సమస్యలు వేధించినా వేలమంది విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దిన ప్రజ్ఞాశాలి అని కొనియాడారు. ప్రజాస్వామ్య హక్కులను కాపాడిన వారధిని కోల్పోవడం సమాజానికి తీరని లోటు అన్నారు.

నేడు డయల్ యువర్ కమిషనర్

కాకినాడ కలెక్టరేట్: నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కమిషనర్ భావన తెలిపారు. 0884-2357800 నంబరుకు ఫోను ద్వారా ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు సమస్యలు చెప్పవచ్చునని తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ ద్వారా నేరుగా అర్జీలు స్వీకరించనున్నట్లు తెలిపారు.

స.హ. చట్టాన్ని పక్కాగా అమలు చేయాలి

కాకినాడ కలెక్టరేట్: ప్రభుత్వ కార్యాలయాల్లో సమాచార హక్కు చట్టాన్ని పక్కాగా అమలు చేయాలని చట్టం కార్యకర్త గేదెల శ్రీనివాస్ కోరారు. ఈ చట్టం వచ్చి శనివారం నాటికి 19 ఏళ్ల పూర్తయిన సందర్భంగా ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ కార్యాలయాల్లో 4(1)(బీ) సక్రమంగా అమలు చేయట్లేదన్నారు. గ్రామ, మండల, జిల్లా కార్యాలయాల్లో మూమెంట్ రిజిస్టర్ అందుబాటులో ఉంచట్లేదన్నారు. త్వరలో విద్యా సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాల్లో ఈ చట్టం అమలుపై పరిశీలించాలన్నారు.

'ఆలయాల్లో వ్యాపార ధోరణ తగదు'

గాంధీనగర్: నగరంలోని సూర్యారావుపేటలోని బాలాత్రిపుర సుందరి ఆలయంలో ప్రవేశ ధరలు తొలగించాలని పౌర సంక్షేమ సంఘ కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పూజలు, ఆశీర్వచనాలు వ్యాపార ధోరణిగా మారాయన్నారు. రామాలయం, బాదం వారి వీధుల్లో అసాంఘిక శక్తులతో ఆలయానికి వస్తున్న వారిని ఇబ్బంది పెడుతున్నారని ఆరోపించారు.

శ్రీమాత్రే నమః



పెద్ద శివాలయంలో..



భానుగుడి శివాలయంలో..



మెయిన్‌రోడ్డులోని రామాలయంలో..



బాలాత్రిపుర సుందరి ఆలయంలో శమీ వృక్షానికి పూజలు





గొడారిగుంట అంబేడ్కర్ కూడలిలో ఆకట్టుకున్న విచిత్ర వేషధారణలు

గాంధీనగర్, సాంబమూర్తినగర్: సూర్యారావుపేటలోని బాలాత్రిపుర సుందరి అమ్మవారి ఆలయంలో శరన్నవరాత్రి మహోత్సవాలు శనివారంతో ముగిశాయి. ఉదయం విశేష పూజలు చేయగా సాయంత్రం బంగారు చీరలో అమ్మవారు దర్శనమిచ్చారు. నగర ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు, దంపతులు దర్శించుకున్నారు. సంతచెరువు వద్ద కనకదుర్గాదేవి ఆలయంలో అమ్మవారు వెంకటేశ్వరస్వామి అలంకరణలో కనువిందుచేశారు. దేవాలయం వీధిలోని పెద్ద శివాలయంలో అమ్మవారు రజత చీరలో బాలాత్రిపుర సుందరిగా దర్శనమిచ్చారు. వేణుగోపాలస్వామి ఆలయంలో శమీవృక్షానికి పూజలు చేశారు. గాంధీనగర్‌లోని కనకదుర్గ, మాధవనగర్‌లోని శ్రీకనకదుర్గ, భానుగుడి సెంటర్‌లోని ఉషాబాలాత్రిపుర సుందరి సమేత భానులింగేశ్వరస్వామి ఆలయాల్లో అమ్మవారు రాజరాజేశ్వరిదేవిగా దర్శనమిచ్చారు. జగన్నాథపురం, సూర్యనారాయణపురం, అచ్యుతాపురం, బాలాజీచెరువు, వెంకట్‌నగర్, వార్ఫు రోడ్డు, శ్రీరామ్‌నగర్, శారదాంబ, డైరీఫారం సెంటర్, సాంబమూర్తినగర్, శాంతినగర్ తదితర ప్రాంతాల్లోని అమ్మవారి ఆలయాల్లో విజయదశమి సందర్భంగా శమీ పూజలు చేశారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం, వాహనంతో అధికారులు

2.6 టన్నుల చౌక బియ్యం పట్టివేత

కాకినాడ కలెక్టరేట్: కాకినాడలో రేషన్ బియ్యం తరలిస్తున్న వాహనాన్ని పట్టుకుని, 2.6 టన్నుల సరకును విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. కాకినాడకు చెందిన ఏ.గోపి అనే వ్యక్తి అక్రమంగా రేషన్ బియ్యాన్ని సేకరించి, తరలించడానికి సిద్ధం చేశారు. శనివారం కాకినాడలోని కల్పన కూడలికి సమీపంలో తనిఖీలు చేశారు. 51 బస్తాల్లో 2,600 కేజీల బియ్యాన్ని గుర్తించారు. పౌరసరఫరాల శాఖ అధికారులకు అప్పగించారు. రూ.9,55,650 విలువైన రేషన్ బియ్యం, వాహనాన్ని సీజ్ చేశారు. 6ఏ కేసు నమోదు చేశారు. అక్రమ నిల్వ, రవాణాకు పాల్పడిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని పోలీసులకు సిఫార్సు చేశారు. విజిలెన్స్ అధికారులు నాగవెంకటరాజు, వీరబాబు, వలీ, జీవానందం, శివ, పౌరసరఫరాల శాఖ డీటీ ఇస్మాయేలు పాల్గొన్నారు.

చికిత్సపొందుతూ ఒకరి మృతి

మసీదుసెంటర్(కాకినాడ): కాకినాడ సంజయ్‌నగర్‌కి చెందిన డి.వెంకటేశ్వరరావు జీజీహెచ్‌లో చికిత్సపొందుతూ ఆదివారం మృతిచెందారు. వ్యక్తిగత కారణాలతో పురుగుల మందు తాగిన ఘటనలో ప్రథమచికిత్స అనంతరం ఈనెల 9న జీజీహెచ్‌లో చేర్చారు. దీనిపై కాకినాడ పోర్టు పోలీసులు కేసు నమోదు చేశారు.

అక్రమ మద్యం స్వాధీనం

మసీదు సెంటర్: మద్యం అక్రమంగా విక్రయిస్తున్న వ్యక్తిని కాకినాడ ఒకటో పట్టణ పోలీసులు అరెస్టు చేసి కేసు నమోదు చేశారు. వన్‌టౌన్ సీఐ ఎం.నాగదుర్గారావు శుక్రవారం తెలిపిన వివరాల ప్రకారం.. కాకినాడ రిక్షాలపేటకు చెందిన పెసంగి గంగాధర్ మద్యం అమ్ముతున్నట్లు పోలీసులకు సమాచారం రావడంతో తనిఖీలు చేశారు. తనను అరెస్టు చేసి, 70 క్వార్టర్ మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించామన్నారు.

పాలస్తీనాపై మారణకాండ ఆపాలి



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శేషబాబ్జి

గాంధీనగర్: పాలస్తీనా ప్రజలపై ఇజ్రాయిల్ చేస్తున్న దురాక్రమణను ఆపాలని, భారత ప్రభుత్వం ఇజ్రాయిల్ సైన్యానికి ఆయుధాలను అనధికారికంగా సరఫరా చేయడం మానుకోవాలని, ఐక్యరాజ్యసమితి తీర్మానాన్ని అమెరికా, ఇజ్రాయిల్ ప్రభుత్వాలు ఆమోదించి తక్షణం శాంతిని నెలకొల్పాలని అఖిలపక్ష సమావేశం డిమాండ్ చేసింది. శనివారం సీఐటీయూ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు దువ్వా శేషబాబ్జి అధ్యక్షతన అఖిలపక్ష సమావేశం జరిగింది. వివిధ సంఘాల నాయకులు దూసర్లపూడి రమణరాజు, టి.నాగేశ్వరరావు, జే.వెంకటేశ్వర్లు, పిఎస్.నారాయణ, తాళ్లూరి రాజు, బాబి, వాసులు మాట్లాడారు. ఆసుపత్రులు, శరణార్థి శిబిరాలు, పాఠశాలలపై బాంబులు వేయడంతో 12వేల మంది చిన్నారులు, 10వేల మంది మహిళలు, 20వేలమంది పౌరులు మరణించారని ఆవేదన వ్యక్తం చేశారు. మోదీ ద్వంద్వ వైఖరి విడనాడి ప్రపంచ శాంతికి, అలీన విదేశాంగ విధానానికి కట్టుబడి ఉండాలన్నారు. 124 దేశాలు ఆమోదించిన ఐక్యరాజ్యసమితి తీర్మానం ప్రకారం ఆక్రమించిన భూభాగం నుంచి ఇజ్రాయిల్ ప్రభుత్వం వైదొలగాలని డిమాండ్ చేశారు. వివిధ సంఘాల నాయకులు కె.సత్తిరాజు, చెక్కలరాజ్‌కుమార్, ఎం.వెంకటరమణ, ఇబ్రహీం, రాజబాబు, నర్ల ఈశ్వరి, పద్మ, నరసింహ, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

పేదల జీవితాల్లో యువ వెలుగులు



మిత్ర బృందం సేవా సంఘం సభ్యులు

సాంబమూర్తినగర్, న్యూస్‌టుడే: సమాజానికి తనవంతు ఏదైనా చేయాలని ఆ యువకుడు అనుకున్నాడు. ఆలోచనలకు రూపం ఇస్తూ ఒక అడుగు వేశాడు. మంచి పని కావడంతో అందరూ తమ వంతు సహకారం అందించారు. అలా ఒక్కో చేయి కలవడంతో ఆ సంఘంలో ప్రస్తుతం 200 మందికిపైగా యువతీయువకులు సభ్యులుగా ఉన్నారు.

అలా మొదలైంది..

కాకినాడ గంగనాపల్లికి చెందిన రామకృష్ణ ఎంబీఏ చదువుతున్నాడు. 2021 డిసెంబరులో తన ఆప్త మిత్రుడికి రక్తం అవసరమైంది. మిగిలిన స్నేహితులతో కలిసి ఎంతో ప్రయత్నించారు. ఎక్కడెక్కడో తిరిగారు. అతికష్టం మీద దొరికింది. ఆరోజు రక్తం విలువ తెలిసింది. అప్పుడు 'రక్తదానం చేయండి-ప్రాణదాతలు కండి' పేరుతో ఓ వాట్సాప్ బృందాన్ని రూపొందించాడు. అప్పట్లో 50 మంది మిత్రులు అండగా నిలిచారు. అలా మొదలైన సేవా ప్రయాణం 200 మందికిపైగా సేవకులను తయారుచేసింది.

సేవా సంఘం స్థాపించి..

మిత్రబృందం-సేవా సంఘం పేరుతో 2023 జులైలో సేవా సంఘాన్ని స్థాపించాడు. చదువుకుంటున్న వారు, ఉద్యోగులు, వ్యాపారులు అందులో భాగస్వాములు అవ్వడంతో రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేశారు. తలసేమియాతో బాధపడుతున్న చిన్నారులకు రక్తదానం చేస్తున్నారు. ప్రమాదాల్లో గాయపడిన పేదలకు ఆ రక్తాన్ని వినియోగించడంతో పాటు, ఆర్థికంగాను అండగా నిలబడుతున్నారు. చిన్నారులకు పోషకాహార కిట్లు అందిస్తున్నారు.

విద్యాభివృద్ధికి..

గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థులకు విద్యాసామగ్రి సమకూర్చడంతో పాటు, సైకిళ్లు అందజేస్తున్నారు. 10వ తరగతి విద్యార్థులకు ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నారు. ప్రతిభా పరీక్షలు నిర్వహించి ప్రోత్సాహక బహుమతులు ఇస్తున్నారు. వన సంరక్షణ పేరుతో పాఠశాలలకు మొక్కలు పంపిణీ చేస్తున్నారు.

✦ సంఘంలో ఉన్నవారంతా చిరుద్యోగులే. పేదల కళ్లలో ఆనందమే మమ్మల్ని నడిపిస్తోంది. త్వరలో గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా కళ్లజోళ్లు, మందులు పంపిణీ చేసేందుకు సమాయత్తం అవుతున్నాం.

– రామకృష్ణ, సంఘం వ్యవస్థాపకుడు

అత్యాధునిక పరికరాలతో ఛాయా స్కిన్ కేర్



నిర్వాహకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వనమాడి

మసీదు సెంటర్: అత్యాధునిక లేజర్ వైద్య పరికరాలతో ఛాయా స్కిన్ కేర్ ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పేర్కొన్నారు. శనివారం విజయదశమి సందర్భంగా గొడారిగుంటలో ఛాయా స్కిన్ కేర్ నూతన భవనాన్ని ఎమ్మెల్యే కొండబాబు, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ ఛైర్మన్ తోట సుధీర్, గుణ్ణం చంద్రమౌళి ముఖ్యఅతిథులుగా హాజరై ప్రారంభించారు. స్కిన్ కేర్ మేనేజింగ్ డైరెక్టర్ డా.కె.ఉమాశంకర్, డా.ఇందిరా ప్రియదర్శిని మాట్లాడుతూ మొదటిసారిగా అత్యాధునిక లేజర్ పరికరాలతో అన్ని రకాల చర్మవ్యాధులకు చికిత్స అందిస్తున్నామన్నారు.

'చదువు'కు చేయూత..



మసీదు సెంటర్: పీఆర్ డిగ్రీ కళాశాల గ్రౌండ్ బాయ్‌గా పనిచేస్తున్న శ్రీను కుమారుడు కార్తీక్ డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. హరీష్ స్పోర్ట్స్ అధినేత తలాటం హరీష్ తనకు ఆర్థికసాయం చేశారు. రూ.18 వేల చెక్కును ఆదివారం విద్యార్థికి అందజేశారు. కళాశాల పీడీ రమణ తదితరులు పాల్గొన్నారు.

'ఆన్నార్తుల కడుపు' నింపాలని..



సాంబమూర్తినగర్, కాకినాడ నగరం: ప్రజా సంక్షేమమే నారా లోకేష్ యువజన ఫౌండేషన్ ధ్యేయమని ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మండపాక సుబ్బు పేర్కొన్నారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం విజయదశమి సందర్భంగా పేదలకు బియ్యం, వృద్ధ మహిళలకు చీరలను పంపిణీ చేశారు. ఫౌండేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చెరుకూరి సాయిరామ్‌వర్మ, రాష్ట్ర గౌరవాధ్యక్షుడు చుండ్రు వీర్రాజు చౌదరి, రాష్ట్ర కార్యదర్శి గూడెం అప్పారావు, చుక్కా సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

కాకినాడ గ్రామీణం

• కాకినాడ గ్రామీణం • పెద్దాపురం • పిఠాపురం

తాటిపర్తిలో ఆధ్యాత్మిక శోభ

గొల్లప్రోలు: తాటిపర్తిలో శ్రీపాద శ్రీవల్లభ స్వామి పంచారామ పల్లకి శోభాయాత్ర సోమవారం నిర్వహించనున్నారు. పిఠాపురంలో డిసెంబరు 13 నుంచి 15వ తేదీ వరకు ప్రతిష్ఠాత్మకంగా యాగం నిర్వహించనున్న నేపథ్యంలో గ్రామాల్లో శోభాయాత్ర నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ ప్రతినిధులు తెలిపారు. పిఠాపురం నుంచి అమరావతి, అమరావతి నుంచి పిఠాపురం వరకు యాత్ర కొనసాగుతుందన్నారు. ఉద్ధండేవి ఆలయ కమిటీ ప్రతినిధులు, స్థానికులు పాల్గొన్నారు.



శ్రీపాద శ్రీవల్లభస్వామి పంచారామ పల్లకి శోభాయాత్ర

నేటి నుంచి పల్లెల్లో అభివృద్ధి పండగ

పిఠాపురం: పిఠాపురం నియోజకవర్గవ్యాప్తంగా అభివృద్ధి పనులకు సోమవారం శంకుస్థాపనలు నిర్వహించనున్నట్లు జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి మర్రెడ్డి శ్రీనివాస్ తెలిపారు. వారం పాటు పల్లె పండగ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఉపాధి హామీ పథకం నిధులతో గ్రామాల్లో కేటాయించిన రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణాలకు శంకుస్థాపనలు చేస్తామన్నారు.

పెద్దాపురంలో రక్తదానం

పెద్దాపురం: పెద్దాపురం పట్టణం తాశ్నూర్ వారి సత్రంలో సాయి సేవా గ్రూప్ ఆధ్వర్యంలో శనివారం 6వ రక్తదాన శిబిరం నిర్వహించారు. పెద్దాపురం, కాకినాడ రోటరీ బ్లడ్ బ్యాంక్ అనుసంధానంతో నిర్వహించిన ఈ శిబిరం ద్వారా సుమారు 130 మంది రక్తాన్ని దానం చేశారు. సభ్యులు, రోటరీ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

పైపులైనుకు మరమ్మతులు

సమస్య: పిఠాపురం పట్టణంలోని పెద్దబజారు నుంచి కుంతీ మాధవస్వామి ఆలయానికి వెళ్లే మార్గంలో పైపులైను పగిలి నీరు వృథాగా పోతోంది. మంచినీరు కలుషితమయ్యే ప్రమాదం ఉంది. - చంద్రశేఖర్, వేణుగోపాలస్వామి ఆలయం వీధి

పరిష్కారం: సమస్యను పరిష్కరించేందుకు పైపులైనుకు మరమ్మతులు చేశారు. తాగునీటి వృథా ఆగింది. - కనకారావు, కమిషనర్

- న్యూస్‌టుడే, పిఠాపురం

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు:
కాకినాడ గ్రామీణం: 80085 74325
పెద్దాపురం: 80085 74198
పిఠాపురం: 80085 65544

గ్రామీణం అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యం

పెద్దాపురం: గ్రామీణ ప్రాంత అభివృద్ధే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పెద్దాపురం ఎమ్మెల్యే చినరాజప్ప పేర్కొన్నారు. పులిమేరులో పంచాయతీ కార్యాలయ భవనాన్ని ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తోందన్నారు. గత ప్రభుత్వం ఎలాంటి అభివృద్ధి పనులూ చేయకపోవడంతో ప్రజలు ఇబ్బందిపడ్డారన్నారు. కార్యక్రమంలో ఏపీ పౌరసరఫరాలశాఖ కార్పొరేషన్ సభ్యులు తుమ్మల పద్మజాలక్ష్మి, బుల్లియ్య, దుర్గాజీ, చిన్ని, రాజా, చినబాబు, నాగబాబు, ప్రసాద్, నాని, అరవిందకుమార్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే చినరాజప్ప, రామస్వామి

శివాలయం అభివృద్ధికి కృషి

గొల్లప్రోలు: గొల్లప్రోలులోని ఉమారామలింగేశ్వరస్వామి ఆలయం(శివాలయం) అభివృద్ధికి కృషి చేస్తామని, భక్తులకు సౌకర్యాల కల్పనకు చర్యలు చేపడతామని కమిటీ ఛైర్మన్ గొల్లపల్లి పెదబాబి అన్నారు. గొల్లప్రోలు శివాలయంలో నూతనంగా ఏర్పాటైన కమిటీ ఛైర్మన్‌గా పెదబాబి శనివారం ప్రమాణ స్వీకారం చేశారు. సభ్యులుగా గుండ సుబ్బారావు, జ్యోతుల అనంతలక్ష్మి, నాగమళ్ల బంగారం, సిద్ధా గంగాభవాని, గున్నాబత్తుల లక్ష్మి, కుర్రు శివాజీ, కర్రి అన్నవరం, వల్లూరి నాగబాబు, బొత్స విజయలక్ష్మి, మాదేపల్లి సత్యనారాయణ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి మర్రెడ్డి శ్రీనివాస్, కడారి తమ్మయ్య నాయుడు, ఛైర్మన్ పెదబాబి మాట్లాడారు.



గొల్లప్రోలులోని శివాలయం కమిటీ ప్రమాణ స్వీకారం



గొల్లప్రోలులో బతుకమ్మల ఊరేగింపు



సంప్రదాయ నృత్యాలు



కోరంగిలో ఎమ్మెల్యే బుచ్చిబాబు



గ్రామోత్సవంలో అనంతలక్ష్మి తదితరులు



గొల్లప్రోలు: బోనాల ఊరేగింపు

సంబరాల పండగ.. సందడే నిండుగ..

పెదపూడి, గొల్లప్రోలు, పెద్దాపురం, కరప, సామర్లకోట, కొత్తపల్లి, కాజులూరు, సర్పవరం జంక్షన్, తాళ్లరేవు: పెదపూడి శ్రీ శ్యామలాంబ సమేత సోమేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంపర విజయదుర్గాదేవి ఆలయంలో అమ్మవారు కనకదుర్గ అవతారంలో భక్తులకు దర్శనం కల్పించారు. ● చేబ్రోలు నుంచి జాతీయ రహదారి మీదుగా బోనాలతో మహిళలు ఊరేగింపుగా చెందుర్తి కూడలి వద్దనున్న కనకదుర్గమ్మ ఆలయానికి చేరుకుని పూజలు చేశారు. గొల్లప్రోలులోని ఆర్టీసీ బస్టాండు, కరణంగారితోటలోని ఆలయాల్లో పూజలు, భజన కార్యక్రమాలు నిర్వహించారు. ● పౌరాణిక అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు అనంతరం బతుకమ్మలతో మహిళలు, యువతులు ఊరేగింపు చేశారు. పల్లకిలో పాడూరికి అమ్మవారిని అలంకరించి ఊరేగించారు. పెద్దాపురం పట్టణం, కాండ్రకోట నూకాలమ్మ గుడిలో అమ్మవార్లు శ్రీరాజరాజేశ్వరీదేవిగా దర్శనమిచ్చారు. ● పాదగయ క్షేత్రంలో రాజరాజేశ్వరి అమ్మవారు విజయదుర్గాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పరాశక్తి పీఠం పురుహూతిక అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. మాజీ ఎమ్మెల్యే వర్మ, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి మర్రెడ్డి శ్రీనివాస్ పూజల్లో పాల్గొన్నారు. కరప: పెనుగుదురులో దుర్గాదేవి మండపం వద్ద శనివారం మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, సత్యనారాయణమూర్తి పూజలు చేశారు. బోనాల ఊరేగింపు సందడి నెలకొంది. ● కొత్తపల్లి ప్రధాన సెంటర్‌లో అమ్మవారి గ్రామోత్సవం చేశారు. గాదిందుర్తి బాలదుర్గాదేవి ఆలయంలో మాజీ ఎమ్మెల్యే వర్మ కానుకలు సమర్పించారు. ● కాజులూరు గొల్లపాలెంలో ఏనుగుల సంబరం ఘనంగా నిర్వహించారు. ● దుర్గాదేవి ఆలయంలో తప్పెట గుళ్లతో తాడి పెద్దు, శూలాల సంబరాలు నిర్వహించారు. ● ఉండూరులోని మహాలక్ష్మి ఆలయంలో ప్రభ కరరావు దంపతులు 108 రకాల నైవేద్యాలు సమర్పించారు. ● సామర్లకోట బ్యారక్‌కాలనీలో కొన్ని లర్ పాగా సురేష్ ఆధ్వర్యంలో అమ్మవారి విగ్రహాన్ని అశ్వంపై ఊరేగించారు. ● ఎంపీ తంగెళ్ల ఉదయశ్రీనివాస్ పిఠాపురం రథాలపేట సెంటర్‌లో జనసేన నాయకులు బల్లా నవీన్, వంశీ ఇంటి వద్ద జరిగిన వేడుకల్లో పాల్గొన్నారు. ● సూర్యారావుపేట శీలాగారంలో ఏపీ మోహినీదేవి ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహించారు. ● చేబ్రోలు భజన సత్తిబాబు, శ్రీలక్ష్మి దంపతులు బంగారంతో తయారు చేయించిన మంగళసూత్రాలు, పట్టువస్త్రాలను మమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు, కార్యకర్తలు కోరింగ దుర్గామల్లేశ్వరికి శనివారం బహూకరించారు.



పిఠాపురంలో దుర్గమ్మతల్లిని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే వర్మ



ప్రత్యేక వాహనంలో ఊరేగింపు



అలంకరణలో పెదపూడి శ్యామలాంబదేవి



రాజరాజేశ్వరీదేవిగా కాండ్రకోట నూకాలమ్మ

ఎన్టీయూఏ అభయ్‌తో చేయూత

సాంబమూర్తినగర్, కాకినాడ నగరం: ఎన్టీయూఏ సంఘ సభ్యులకు అభయ్ పథకం అండగా నిలుస్తుందని ఎన్టీయూఏ కాకినాడ, బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షుడు మొర్ల శ్రీనివాస్, పోతంశెట్టి దొరబాబు అన్నారు. ఇటీవల మరణించిన ఎన్టీయూఏ పెదపూడి మండల మాజీ అధ్యక్షుడు వంగా సూర్రెడ్డి కుటుంబ సభ్యులకు అభయ్ పథకం కింద రూ.2 లక్షల ఆర్థికసాయాన్ని అందజేశారు.



ఆర్థికసాయం అందిస్తున్న నాయకులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

గొల్లప్రోలు: తాటిపర్తిలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో 2010-11 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం స్థానిక కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించారు. నాడు విద్యాబుద్ధులు నేర్పించిన ఉపాధ్యాయులను సత్కరించారు. తాము చదివిన పాఠశాల, తరగతి గదులకు వెళ్లి చిన్ననాటి స్మృతులు గుర్తుకు తెచ్చుకున్నారు. 60 మంది కుటుంబ సభ్యులతో హాజరయ్యారు.



2010-11లో కలిసి చదువుకున్న స్నేహితులు

ప్రొఫెసర్ సాయిబాబా మృతి తీరనిలోటు

గొల్లప్రోలు: మానవ హక్కుల నేత, దిల్లీ యూనివర్సిటీ మాజీ ప్రొఫెసర్ సాయిబాబా మృతి ప్రజా ఉద్యమాలకు తీరని లోటని అఖిల భారత కార్మిక సంఘాల సమాఖ్య(ఏఐఎఫ్‌టీయూ) ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కుంచే అంజిబాబు అన్నారు. గొల్లప్రోలులోని జగనన్నకాలనీలో ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం, ఏఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో సాయిబాబాకు నివాళి అర్పించారు. డి.నారాయణమూర్తి వీరన్న, శివ, సోమరాజు, గణేష్ తదితరులు పాల్గొన్నారు. సాయిబాబా మృతి తీరని లోటని సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి బుగత బంగార్రావు అన్నారు.



నివాళి అర్పిస్తున్న ఏఐఎఫ్‌టీయూ నాయకులు

అందుబాటులో జనసేన కార్యాలయం

పిఠాపురం: ప్రజలకు మరింత చేరువ కావాలనే ఉద్దేశంతో జనసేన పార్టీ కార్యాలయాన్ని అందుబాటులోకి తెచ్చామని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి మర్రెడ్డి శ్రీనివాస్ తెలిపారు. పిఠాపురంలోని సీతయ్యగారితోట ప్రాంతంలో జనసేన పార్టీ కార్యాలయాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా దసరా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీనివాస్ మాట్లాడుతూ పేద ప్రజలకు ఇబ్బందులు, అవసరాలుంటే కార్యాలయానికి రావచ్చని చెప్పారు.



ప్రారంభిస్తున్న ఇన్‌ఛార్జి మర్రెడ్డి శ్రీనివాస్

భక్తిశ్రద్ధలతో పుణ్యతిథి ఉత్సవాలు

సర్పవరం జంక్షన్, పెద్దాపురం, న్యూస్‌టుడే: కాకినాడ గ్రామీణం, అర్బన్ ప్రాంతాల్లో దసరా ఉత్సవాలు, శిర్డీ సాయిబాబా పుణ్యతిథి(సమాధి) ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బాబాకు అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. రేపూరు గ్రామంలోని అమ్మల విరాట్ సాయిబాబా ఆలయ ప్రతినిధులు సుమారు 1500 మంది సర్పవరం జంక్షన్ నుంచి కాకినాడలోని పలు ప్రాంతాల్లో సాయిబాబా విగ్రహంతో ఊరేగింపు నిర్వహించారు. ● పెద్దాపురంలో శిర్డీ సాయిబాబా నవరాత్రి ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి. తొమ్మిది రోజులపాటు ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు.



ఊరేగింపులో రేపూరు ఆలయ ప్రతినిధులు

కార్తిక మాస ఉత్సవాలకు రాట

సామర్లకోట: కుమారారామ భీమేశ్వరాలయంలో కార్తిక మాస ఉత్సవాలకు ఆలయ ఈవో నీలకంఠం ఆధ్వర్యంలో ఆదివారం రాట ముహూర్త పూజా కార్యక్రమాలు ఆలయ వేదపండితులు, అర్చకులు ఘనంగా నిర్వహించారు. నవంబరు 4, 11, 18, 25 తేదీల్లో ప్రత్యేక పూజలు ఉంటాయన్నారు.

పుంత రోడ్డు అధ్వానం



పిఠాపురం మండలంలోని నరసింగపురం నుంచి లక్ష్మీనరసాపురం వెళ్లే పుంత రోడ్డు అధ్వానంగా మారింది. రోడ్డుకు ఇరువైపులా తుప్పలు ఆవరించడంతో దారి ఇరుకుగా మారింది. ఈ మార్గంలో ఇటుక బట్టీలు, ఉద్యాన పంటలు ఉంటాయి. నిత్యం ట్రాక్టర్లు, ఆటోలు ఈ మార్గంలో తిరుగుతుంటాయి. రోడ్డంతా తుప్పలు పెరిగిపోయి రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. దీనికి తోడు ఈ రోడ్డు పదేళ్లుగా గుంతలు పడి, రాళ్లు తేలిఉంది. మరమ్మతులకు నోచుకోక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షం పడితే గోతుల్లో నీరు నిలిచి, బురదమయంగా మారుతోంది. తక్షణం మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. దీనిపై పంచాయతీరాజ్ శాఖ ఏఈ నూకరాజును వివరణ కోరగా రోడ్డు నిర్మాణానికి సంబంధించి ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించామన్నారు. – న్యూస్‌టుడే, పిఠాపురం

సముద్ర తీరం.. పండగ సంతోషం



తీరంలో చిన్నారుల సందడి

సర్పవరం జంక్షన్, న్యూస్‌టుడే: కాకినాడ గ్రామీణం సూర్యారావుపేట సమీప సముద్రతీరంలో శని, ఆదివారాల్లో దసరా సందడి నెలకొంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో పర్యాటకులు తరలివచ్చి తీరంలో సేదదీరారు. చిన్న, పెద్ద తారతమ్యం లేకుండా ఆటపాటలతో కాలక్షేపం చేశారు. చిన్నారులు ఇసుకలో గూళ్లు కడుతూ ఆటలాడారు. తిమ్మాపురం, మెరైన్ పోలీసుల ఆధ్వర్యంలో భద్రతా చర్యలు చేపట్టారు.



కాకినాడ గ్రామీణం సూర్యారావుపేట సముద్రతీరంలో పర్యాటకులు

ఉత్సాహంగా ఎమ్మెల్సీ ఓట్ల నమోదు

సామర్లకోట: సామర్లకోట పట్టణంలో ఎమ్మెల్సీ ఓట్ల నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఆదివారం పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ఆదేశాల మేరకు పట్టణ తెదేపా అధ్యక్షుడు అడబాల కుమారస్వామి, కార్యదర్శి బడుగు శ్రీకాంత్ ఆధ్వర్యంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓట్లు వేసేందుకు ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహించారు. ప్రసాద్, శివరామకృష్ణ, శివకుమార్ పాల్గొన్నారు.

మండల ఎమ్మార్పీఎస్ నూతన కమిటీ

పెద్దాపురం: ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ అనుబంధ సంఘాల మండల కమిటీ కన్వీనర్‌గా గొడ్తా రాముడు, కోకన్వీనర్ సతీష్, కార్యదర్శి చిన్ని, పట్టణ కమిటీ కన్వీనర్ ప్రసన్నకుమార్, కోకన్వీనర్‌గా విజయకుమార్, కార్యదర్శిగా సూరిబాబులను శనివారం ఎన్నుకున్నారు.

హుండీల ఆదాయం లెక్కింపు

పెద్దాపురం: తిరుపతిలోని శ్రీశృంగార వల్లభస్వామిని శనివారం భక్తులు దర్శించుకున్నారు. తద్వారా రూ.2.48 లక్షల ఆదాయం వచ్చిందని ఈవో శ్రీనివాసరావు పేర్కొన్నారు. నారాయణాచార్యులు, పురుషోత్తమాచార్యులు పాల్గొన్నారు.

వైభవంగా నగర సంకీర్తన

గొల్లప్రోలు: గొల్లప్రోలులో గోవిందనామ నగర సంకీర్తన శనివారం తెల్లవారుజామున వైభవంగా నిర్వహించారు. రైల్వేస్టేషన్ సమీపంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు పూజలు చేశారని వీరరాఘవులు తెలిపారు.

బేతాళస్వామి గ్రామోత్సవం

సామర్లకోట గ్రామీణం: వేట్లపాలెంలో బేతాళస్వామి సంబరాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో 9 రోజులపాటు నిత్య పూజలు చేశారు. పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, జనసేన కాకినాడ జిల్లా అధ్యక్షులు తుమ్మల రామస్వామి, తెదేపా నాయకులు గుణ్ణం చంద్రమౌళి తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు.

తాగి వాహనాలు నడిపితే జరిమానా

తాళ్లరేవు: పి.మల్లవరం చెక్‌పోస్టు వద్ద కోరింగ ఎస్సై సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆదివారం వాహన తనిఖీ చేశారు. 22 మంది మద్యం తాగినట్లు గుర్తించారు.

దిగ్విజయం.. శ్రీమహాశక్తియాగం

సర్పవరం జంక్షన్: భక్తుల పరిపూర్ణ విశ్వాసంతో శ్రీమహాశక్తి యాగం దిగ్విజయం అయ్యిందని, అమ్మవారి అనుగ్రహం భక్తులందరికీ లభిస్తుందని శ్రీపీఠం అధిపతి స్వామి పరిపూర్ణానంద సరస్వతి తెలిపారు. శనివారం కాకినాడ గ్రామీణం రమణయ్యపేట శ్రీపీఠంలోని ఐశ్వర్యాంబిక అమ్మవారు భక్తులకు రజత కవచ అలంకరణ, ఆదివారం వేంకటేశ్వరస్వామి అలంకారంలో దర్శనమిచ్చారు. శ్రీమహాశక్తియాగం-2024, శరన్నవరాత్రి ఉత్సవాలకు శనివారం తెలుగు రాష్ట్రాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. పీఠాధిపతి ఆధ్వర్యంలో ఉజ్జయిని నుంచి వచ్చిన నితిన్ పర్యవేక్షణలో వేదపండితులు 100 కోట్ల కుంకుమార్చనలు, నవవిధ హోమాలు తదితరాలు నిర్వహించారు. చివరి రోజు సుమారు 30 వేల మంది మహిళలు అరుణవర్ణ ఏకరూప దుస్తులతో ఉచిత సామూహిక కుంకుమ పూజల్లో పాల్గొన్నారని నిర్వాహకులు తెలిపారు. యానాం ఎమ్మెల్యే గొల్లపల్లి అశోక్, జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ అమ్మవారిని దర్శించుకున్నారు. ఆదివారం సాయంత్రం కాకినాడ మార్వాడీ సంఘం ప్రతినిధులు దాండియా నృత్యాలతో అలరించారు. స్వామీజీ చేతుల మీదుగా భక్తులకు తులసి మొక్కలు పంపిణీ చేశారు. కాకినాడ డీఎస్పీ రఘువీర్ విష్ణు పర్యవేక్షణలో సీఐలు పెద్దిరాజు, చైతన్యకృష్ణ, రామారావు ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది భద్రత, ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నారు.



అమ్మవారికి హారతి ఇస్తున్న పీఠాధిపతి

నేర వార్తలు

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

సామర్లకోట: రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. రైల్వే పోలీసుల వివరాల ప్రకారం. . శనివారం మేడపాడు-గూడపర్తి మధ్య రైల్వే పట్టాలపై సుమారు 55 ఏళ్ల వయసు గల గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిఉన్నాడు. ఒంటిపై తెలుపుపై ఎర్రని గీతల చొక్కా, నీలం, తెలుపు, నలుపు గడుల షార్టు ఉన్నాయి. గుర్తుతెలియని వ్యక్తిగా కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

కారు ఢీకొని వృద్ధుడి దుర్మరణం

గొల్లప్రోలు: వన్నెపూడి పరిధి జాతీయ రహదారిపై శనివారం కారు ఢీకొన్న ప్రమాదంలో శ్రీపతి సుబ్బారావు(75) మృతి చెందినట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

ఆర్థిక సమస్యలతో ఆత్మహత్యాయత్నం

మసీదుసెంటర్(కాకినాడ): తాళ్లరేవు మండలం చొల్లంగికి చెందిన వి.వి.రమణ ఆర్థిక సమస్యలతో మనస్తాపం చెంది విష రసాయనం తాగారు. ఆదివారం కాకినాడ జీజీహెచ్‌లో చేర్చారు.

కుటుంబ కలహాలతో..

మసీదుసెంటర్(కాకినాడ): కాకినాడ గ్రామీణం ముత్తానగర్‌కి చెందిన 26 ఏళ్ల వివాహిత కుటుంబ కలహాల నేపథ్యంలో మనస్తాపం చెంది ఇంటి వద్ద చీమలమందు తాగింది. అస్వస్థతకు గురవ్వడంతో చికిత్స నిమిత్తం ఆదివారం జీజీహెచ్‌లో చేర్చారు.

వృద్ధురాలి అదృశ్యం.. కేసు నమోదు

పెదపూడి: దోమాడకు చెందిన కాకర సత్యవతి(72) ఈ నెల 7న అర్ధరాత్రి ఇంటినుంచి ఎటో వెళ్లి తిరిగి రాలేదు. ఆమె కుమారుడు సత్తిరాజు ఫిర్యాదుతో పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు.

ఎనిమిది మంది అరెస్టు

సామర్లకోట: సామర్లకోట-పిఠాపురం రోడ్డులో దాబాలో పేకాట ఆడుతున్నారనే సమాచారంతో సామర్లకోట సీఐ కృష్ణ భగవాన్ సిబ్బందితో శనివారం దాడి చేశారు. ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.13 వేల నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

వివాహిత మెడలో తాళిబొట్టు చోరీ

పెద్దాపురం: పట్టపగలే మహిళ మెడలో తాళిబొట్టు చోరీ చేసిన ఘటన పెద్దాపురం మండలం కట్టమూరులో శనివారం ఉదయం జరిగింది. పెద్దాపురం పోలీసుల సమాచారం ప్రకారం.. గ్రామానికి చెందిన భూలక్ష్మి దుర్గమ్మగుడికి తోటి మహిళలతో దర్శనంకోసం వెళుతుండగా ద్విచక్ర వాహనంపై వచ్చిన ఇద్దరు యువకులు ఆమె మెడలోని సుమారు రూ.2 లక్షల విలువైన మూడు కాసుల బంగారు తాళిబొట్టు లాక్కొని పరారయ్యారు. ఎస్సై మౌనిక దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటింటికీ గ్యాస్ సరఫరా చేయాలి

తాళ్లరేవు: గాడిమొగలో రిలయన్స్ సంస్థ తాళ్లరేవు మండలాన్ని దత్తత తీసుకుని అభివృద్ధి చేయాలని, ఇంటింటికీ గ్యాస్ సరఫరా చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు కమిడి సత్య శ్రీనివాస్, మండల కార్యదర్శి టేకుమూడి ఈశ్వరరావు, వల్లు రాజుబాబు, దుప్పి అదృష్టదీపక్ డిమాండ్ చేశారు. ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

కడ'గండ్లు' ఉండవిక..

– న్యూస్‌టుడే, పిఠాపురం

పిఠాపురం నియోజకవర్గంలో ఆగస్టు నెలాఖరు, సెప్టెంబరు మొదటి వారంలో అధిక వర్షాలు కురిశాయి. ఇదే సమయంలో ఏలేరు జలాశయానికి వరద నీరు భారీగా వచ్చి చేరింది. దాంతో వారం పాటు 40 వేల క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేశారు. దాంతో ఏలేరుపైనున్న ఉప కాలువలన్నీ పొంగి ప్రవహించాయి. వరద నీరు అధికంగా రావడంతో ఎక్కడికక్కడే బలహీన గట్లకు గండ్లు పడ్డాయి. దాంతో పిఠాపురం, గొల్లప్రోలు, కొత్తపల్లి మండలాల్లో దాదాపు 50 కిలోమీటర్ల మేర కాలువ వ్యవస్థ ఉంటే, ఆరు చోట్ల పెద్దవి, మరో పది చోట్ల చిన్న గండ్లు పడ్డాయి. వీటి మరమ్మతులకు జలవనరులశాఖ అధికారులు ఉచితంగా ఇసుక బస్తాలు సమకూర్చడంతో, ఉపాధి హామీ పథకం అధికారులు కూలీలతో ఉప కాలువలకు మరమ్మతులు చేశారు. ఈ గండ్ల వల్ల నియోజకవర్గ పరిధిలో దాదాపు 18 వేల ఎకరాల పంట నీట మునగడంతో భారీ నష్టం వాటిల్లింది. కాగా డిసెంబరు వరకు మళ్లీ వరదలు, వర్షాలు వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో సకాలంలో గండ్ల పూడ్చివేతకు జలవనరుల శాఖ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేసి ఉన్నతాధికారులు పంపించారు. మళ్లీ వరదలు వస్తే కాలువల్లోంచి పొలాల్లోకి నీరు వెళ్లకుండా ఉండేలా చర్యలు ప్రారంభించారు.

నిధుల మంజూరు ఇలా..

పిఠాపురం మండలంలోని రాపర్తిలో గొర్రిఖండి కాలువ ఇరువైపులా రెండు చోట్ల, ఇదే ప్రాంతం వద్ద క్రాస్‌బండ్ నిర్మాణం, పిడిందొడ్డి వద్ద రెండు, పిప్పి కాలువపైనా పెద్దపెద్ద గండ్లు పడ్డాయి. దాంతో రాపర్తి వద్ద గండ్లకు సంబంధించి మూడు పనులకు రూ.9 లక్షలు, రూ.3 లక్షలు, రూ.4 లక్షలు చొప్పున నామినేషన్ పద్ధతిలో విడుదల చేశారు. పనులు ఈ వారంలోనే ప్రారంభించనున్నారు. కాగా పిడిందొడ్డి వద్ద గండ్ల పూడ్చివేతకు రూ.27 లక్షలు, నడియేరు గండ్లకు రూ.15 లక్షలు, ఇతర ప్రాంతాల్లో కాలువలు పటిష్ఠం చేసేందుకు రూ.28 లక్షల వంతున మంజూరు చేశారు. ఈ మూడు పనులకు టెండర్లు పిలవాల్సి ఉంది. ఇప్పటికే ఉప కాలువల మరమ్మతులకు చర్యలు చేపట్టారు. కర్రలు, ఇసుక బస్తాలతో ఉపాధి హామీ కూలీలతో వాటిని బాగు చేస్తున్నారు.



రాపర్తి వద్ద గొర్రిఖండి కాలువకు పడిన గండి

చర్యలు చేపడుతున్నాం..



నియోజకవర్గంలో ఏలేరు వరదకు గట్లు బాగా దెబ్బతిన్నాయి. గండ్లు గుర్తించి పూడ్చివేతకు నిధులు కావాలని ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తే, నిధులు మంజూరు చేశారు. టెండర్లు పిలిచి గుత్తేదారులతో పనులు చేయించేందుకు చర్యలు చేపట్టాం. గట్లన్నీ బలపరిచి, రైతులకు ఇబ్బందులు కలగకుండా చూస్తున్నాం.

- జి.ప్రసన్నకుమార్, జలవనరులశాఖ ఏఈ

తుని

•తుని • ప్రత్తిపాడు • జగ్గంపేట

కనులపండువగా తెప్పోత్సవం



గండేపల్లి (జగ్గంపేట), జగ్గంపేట గ్రామీణం, న్యూస్‌టుడే: జగ్గంపేటలోని పద్మనాభనగర్ కనకదుర్గమ్మ ఆలయ ఆవరణలోని చెరువులో శనివారం పడవ ఉత్సవం (తెప్పోత్సవం) భక్తుల కనులపండువగా నిర్వహించారు. పడవ ఉత్సవంలో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, తెదేపా నాయకులు ఎస్‌వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు. ● కాండ్రేగుల, గుర్రంపాలెం, మల్లిసాల, కాట్రావులపల్లి గ్రామాల్లో నిమజ్జన ఊరేగింపు సందర్భంగా యువకులు నృత్యాలతో సందడి చేశారు. మల్లిసాలలో శనివారం రాత్రి తెప్పోత్సవం ఘనంగా నిర్వహించారు.

రావులమ్మకి వెండి గరగ బహూకరణ

గండేపల్లి (జగ్గంపేట) న్యూస్‌టుడే: జగ్గంపేట గ్రామదేవత రావులమ్మ అమ్మవారికి ఆలయ నిర్వాహకులు తయారుచేయించిన వెండి గరగను శనివారం దసరా ఉత్సవాల సందర్భంగా ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, మణి దంపతుల చేతుల మీదుగా అమ్మవారికి అందించారు. ఆలయ నిర్వాహకులు జీను రాంబాబు, జీను మణిబాబు మాట్లాడుతూ కమిటీ సభ్యులంతా కలిసి వెండి గరగను చేయించినట్లు వివరించారు.



గరగను తీసుకెళ్తున్న ఎమ్మెల్యే నెహ్రూ

ఘనంగా దసరా ఉత్సవాలు



అన్నవరం: స్వామి, అమ్మవార్లకు పూజలు



ఏలేశ్వరంలో నిమజ్జనానికి దుర్గమ్మ విగ్రహం



అరుణాచలక్షేత్రంలో..

న్యూస్‌టుడే బృందం: దసరా ఉత్సవాలు శనివారం ఘనంగా జరిగాయి. రత్నగిరిపై శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా చివరి రోజు సత్యదేవుని క్షేత్ర రక్షకులు వనదుర్గ, కనకదుర్గ అమ్మవార్లను రాజరాజేశ్వరీ అలంకరణలో ప్రత్యేకంగా అలంకరించారు. రాత్రి 7 గంటలకు 'శమీ శమయతే పాపం.. శమీ శత్రు వినాశినీ.. అర్జునస్య ధనుర్ధారీ.. రామస్య ప్రియదర్శిని' అంటూ భక్తులు ప్రదక్షిణ చేశారు. అనంతరం జూనియర్ కళాశాల ప్రాంగణంలో రావణ సంహారం వేడుకగా జరిగింది. సహాయ కమిషనర్లు విశ్వనాథరాజు, సిహెచ్. రామ్మోహనరావు, ఏఈవో కొండలరావు, ఈఈ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. ● తుని పట్టణంలో బెల్లపువీధిలో ఉన్న శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ● రాచపల్లి అరుణాచలేశ్వర క్షేత్రంలోని అపీత కుచాంబ, గజ్జనపూడి శరభవరంలోని రాజరాజేశ్వరి, ప్రత్తిపాడు పాదాలమ్మ, ధర్మవరం విజయదుర్గమ్మ ఇలా అమ్మవారి ఆలయాల్లోవిశేషపూజలు, కుంకుమార్చనలతో పాటు హోమాలు నిర్వహించారు. అన్నదానాలు జరిగాయి. ● ధర్మవరం గ్రామంలో గౌరీదేవిని గ్రామంలోని ఆలయంలో శనివారం కొలువు దీర్చారు. వరదబ్బు రూపంలోని గౌరమ్మను ఊరేగింపుగా తీసుకొచ్చి నిలిపారు. ● తలుపులమ్మ అమ్మవారి లోవ దేవస్థానంలో శనివారం అమ్మవారి రాజరాజేశ్వరి దేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. ఈ ఒక్కరోజే సుమారు 5 వేలకు పైబడి భక్తులు అమ్మవారిని దర్శించుకోవడంతో దేవస్థానంకు రూ. 1.25 లక్షలు ఆదాయం సమకూరినట్లు ఈవో విశ్వనాథరాజు తెలిపారు. ● ఏలేశ్వరం పట్టణం, గ్రామీణంలో పూజలందుకున్న దుర్గామాతలకు ఆదివారం ఘనమైన వీడ్కోలు పలికారు. ఏలేశ్వరంలోని తోట వీధి, లక్ష్మవరం, లింగవరం కాలనీ, దిబ్బలపాలెం ప్రాంతాల నుంచి దుర్గామాత విగ్రహాలను బ్యాండ్ మేళాల మధ్య భక్తజన సందోహం ఏలేరుకి తరలించి గంగమ్మ ఒడికి చేర్చారు. మండలంలోని జె.అన్నవరంలో మహాన్నదానాన్ని ఏర్పాటుచేశారు. గ్రామానికి స్థానిక, పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి దుర్గాదేవి ప్రసాదాన్ని స్వీకరించారు. ● తేటగుంట విజయదుర్గ ఉత్సవ కమిటీ అధ్వర్యంలో ఆదివారం ఉదయం అమ్మవారి శోభయాత్ర శోభాయమానంగా నిర్వహించారు. ● సీతంపేటలోని దుర్గామల్లేశ్వ ఆలయం వద్ద అమ్మవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. ఎన్‌హెచ్‌పై పెద్ద ఎత్తున ట్రాఫిక్ నిలిచిపోవడంతో అన్నవరం ఎస్సై శ్రీహరి బాబు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ● బ్రహ్మోత్సవాల్లో భాగంగా తుని పట్టణంలోని పాతబజారులో ఉన్న శ్రీవేంకటేశ్వరస్వామివారి దేవస్థానంలో దసరా, స్వామివారి పుట్టిన రోజు సందర్భంగా పంచామృతాభిషేకం, శమీపూజ, కల్యాణం ఘనంగా నిర్వహించారు.



లోవ ఆలయంలో బారులు తీరిన భక్తులు



సీతంపేట: రాజరాజేశ్వరీదేవిగా..



తేటగుంట: శోభయాత్రలో పాల్గొన్న భక్తులు

మేమున్నాం.. మీకు తోడుగా

పైపులైను బాగుచేశారు

శంఖవరం: జి.కొత్తపల్లిలో కాలనీ వద్ద తాగునీటి కొళాయిల నుంచి వచ్చే పైపు లీకవడంతో తాగు నీటికి ఇబ్బందులు పడుతున్నామని సమస్యను ఈనాడు-మీతోడు దృష్టికి తీసుకువచ్చారు. సర్పంచి ఈగల విజయదుర్గమ వద్ద ప్రస్తావించగా పంచాయతీ సిబ్బందితో పైపులైను బాగు చేయించారు.

మురుగును తొలగించరూ..

జగ్గంపేట గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని కాట్రావులపల్లిలో బ్యాంకు కాలనీ, మెరకవీధిలో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉందని కాలనీవాసులు వాపోతున్నారు. పలుచోట్ల డ్రైన్లు లేక మురుగునీరు రోడ్లపై పారుతుంది. సమస్యను పంచాయతీ కార్యదర్శి గణేష్‌బాబుకు వివరించగా మురుగు తొలగించే చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: తుని: 9100020946, ప్రత్తిపాడు: 98669 62946 జగ్గంపేట: 80086 22066

నేటి నుంచి పల్లె పండగ

రౌతులపూడి: గ్రామాల్లో నేటి నుంచి ఈనెల 21 వరకూ పల్లె పండుగ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని మండల పరిషత్ కార్యాలయ పరిపాలనాధికారి జగదీశ్వరరావు ఓ ప్రకటనలో తెలిపారు. దిగువశివాడ, గంగవరం, ఎం.కొత్తూరు, బలరాంపురం గ్రామాల్లో 15వ ఆర్థిక సంఘ నిధులతో మంజూరైన సీసీ రహదారుల నిర్మాణానికి ఎమ్మెల్యే సత్యప్రభ, ప్రజాప్రతినిధులు సోమవారం భూమి పూజలో పాల్గొంటారన్నారు.

దాత ఊతంతో శుభ్రత

ప్రత్తిపాడు: చినశంకర్లపూడి గ్రామంలో మంచినీటి ట్యాంకు సమీపంలో చెత్త పేరుకుపోయింది. గ్రామంలోని వ్యర్థాలను ఇక్కడకే చేర్చడంతో పరిసర ప్రాంతాలకు అసౌకర్యంగా ఉంటోంది. దీనికి మాజీ ఉపసర్పంచి ఏపూరి శ్రీను స్పందించారు. పొక్లెయిన్ సమకూర్చి చెత్తను తొలగించారు. ట్యాంకు సమీపంలోని రహదారికి రూపునిచ్చారు. దీంతో రాకపోకలకు వీలుకలిగింది. గ్రామంలో శుభ్రత కోసం శ్రీను చేసిన ప్రయత్నాన్ని పలువురు మెచ్చుకున్నారు.

న్యూస్‌టుడే-ప్రత్తిపాడు

చెరువులా.. చెత్త బుట్టలా..?

చెరువు ఏదైనా ఊళ్లో చెత్త పోగేయడానికి కేంద్రం అవ్వడం బాధాకరం. క్రమేణా ఇది ప్రమాదకరం కూడా. నీటిపారుదలకు ఆటంకం కలుగుతుండగా, ఆక్రమణలకు కారణమవుతోంది. ఊరి మధ్య ఉన్న చెరువును ఆహ్లాదంగా ఉంచుకోవాల్సింది పోయి సమీప జనావాసాలు వ్యర్థాలన్నింటినీ ఇందులోనే కలుపుతున్నారు. సాగు నీటి చెరువులను వదలడం లేదు.

● ఒమ్మంగిలోని 500 ఎకరాలకు నీరందించే రాజుచెరువును చెత్తతో కలుషితం చేస్తున్నారు. అది తూములకు అడ్డుపడుతోంది. ప్రత్తిపాడులోని చెరువులో గత మూడేళ్లుగా చెత్త పెరుగుతోంది. ఈ చెరువు నుంచి వెళ్లే కాలువలో ప్లాస్టిక్ వ్యర్థాలు ఉంటున్నాయి. ప్రత్తిపాడు ఊరిమధ్య చెరువులో ఆరేళ్ల కిందట పూడిక తీసినపుడు 10 ట్రాక్టర్ల వ్యర్థాలను తరలించారంటే కాసారాన్ని ఏ స్థాయిలో కలుషితం చేస్తున్నారో అర్థమవుతుంది. ప్రత్తిపాడు సబ్‌స్టేషన్ చెరువు గట్టున నిర్మించిన ఇళ్లు, దుకాణాలు సెప్టిక్ ట్యాంకులుగా చెరువులనే వాడుతున్నారు. చెరువులకు నీరు వచ్చి పోవడం వల్ల పూడిక సహజంగా ఉంటుంది. ఆ సహజత్వాన్ని దూరం చేసి నరేంద్రగిరి సమీపంలోని ఊర కాలువలు ఆక్రమణలకు గురవుతుండగా, తటాకాలను అనర్థాల తట్టగా మార్చేస్తున్న తీరుపై చర్యలు లేవు. మొహమాటాలు, రాజకీయాలు నీటి వనరులకు ముప్పు తెస్తున్నాయి.



ప్రత్తిపాడు ఊరచెరువులో పోస్తున్న చెత్త



ఒమ్మంగి రాజుచెరువు తూము వద్దకు చేరిన ప్లాస్టిక్ వ్యర్థాలు

జనసేనలో చేరిన వైకాపా జిల్లా ఉపాధ్యక్షుడు

కిర్లంపూడి: వైకాపా కాకినాడ జిల్లా ఉపాధ్యక్షుడు కర్రి శివరామకృష్ణ జగ్గంపేట నియోజకవర్గం జనసేన ఇన్‌ఛార్జి తుమ్మలపల్లి రమేష్ సమక్షంలో జనసేన పార్టీలో శనివారం చేరారు. రామచంద్రపురం గ్రామంలోని తన నివాసంలో రమేష్ ఆయనకు పార్టీ కండువావేసి ఆహ్వానించారు. తన భార్య, ఎర్రంపాలెం మాజీ సర్పంచి అరుణ కూడా పార్టీలో చేరుతున్నట్లు వివరించారు.



రమేష్ సమక్షంలో జనసేనలో చేరిన వైకాపా ఉపాధ్యక్షుడు కర్రి శివరామకృష్ణ

ఆలయ పునఃనిర్మాణానికి ఆర్థిక సాయం

జగ్గంపేట గ్రామీణం: మండలంలోని రాజపూడిలో వేంకటేశ్వరస్వామి ఆలయ పునఃనిర్మాణానికి రుచి దాబా యజమాని పాలచర్ల నాగేంద్ర దంపతులు ఆర్థికసాయం అందించారు. గ్రామంలో పురాతన ఆలయాలైన వేంకటేశ్వరస్వామి, రామాలయం, సత్యనారాయణస్వామి ఆలయాలను నాగేంద్ర దంపతులు, కుమారులు నవదీప్‌వెంకటసాయి, జ్ఞానేశ్వర్ దర్శించుకుని రూ.50 వేల నగదు అందించారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

సత్ప్రవర్తనతో మెలగాలి

కిర్లంపూడి: రౌడీషీటర్లు, అనుమానితులు సత్ప్రవర్తనతో మెలగాలని జగ్గంపేట సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ సూచించారు. పోలీసుస్టేషన్‌లో ఆదివారం రాత్రి 25 మంది రౌడీషీటర్లు, పది మంది అనుమానితులను స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ చేశారు. గొడవలు, సెటిల్‌మెంట్లు, దందాలు ఇతర వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటే చర్యలు తీసుకుంటామన్నారు.

రాజా బుల్లిబాబుకు నివాళి

తుని పట్టణం, న్యూస్‌టుడే: నియోజకవర్గ తొలి శాసనసభ్యుడు రాజా బుల్లిబాబు జయంతి సందర్భంగా శనివారం పలువురు ఆయనకు నివాళి అర్పించారు. కొత్తపేట ఎస్‌పీ రోడ్డులో ఉన్న విగ్రహానికి ఆయన మనవడు, మాజీ ఎమ్మెల్యే రాజా అశోక్‌బాబు, కుటుంబ సభ్యులు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో పృథ్వీరాజు, సీతారామరాజు, దండు అప్పనబాబు, రమేష్‌రాజు, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

అవీ ఇవీ అన్నీ

ప్రొఫెసర్ సాయిబాబాకు..

జగ్గంపేట గ్రామీణం, ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: మానవహక్కుల నేత, ప్రముఖ రచయిత ప్రొఫెసర్ జి.ఎన్.సాయిబాబా మృతి ప్రజా ఉద్యమాలకు తీరని లోటని రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు అన్నారు. రామవరం శివారు రంగవల్లినగర్‌కాలనీలో సాయిబాబా చిత్రపటానికి వద్ద విప్లవ జోహార్లు పలికారు. ఏఐఎఫ్‌టీయూ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కంచె అంజిబాబు, రైతుకూలీ సంఘం నాయకులు కొండేపూడి మంగయమ్మ, దొమ్మేటి అర్జున్, పాపయమ్మ తదితరులు పాల్గొన్నారు.

● ప్రొ.జీఎన్ సాయిబాబా మృతిపై పలు ప్రజా సంఘాల నేతలు విచారం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యవాదులకు ఆయన మృతి తీరని లోటని సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ కేంద్రకమిటీ సభ్యుడు బుగత బంగార్రావు అన్నారు. ప్రొ.సాయిబాబా విషయంలో ప్రాథమిక హక్కులను కాపాడడంలో న్యాయవ్యవస్థ విఫలమైందని ఆల్‌ఇండియా లాయర్స్ అసోసియేషన్ ఫర్ జస్టిస్ (ఐలాజ్) కన్వీనరు బి.శివనారాయణ అన్నారు. సాయిబాబా వంటి ఉద్యమకారులను ఏళ్ల తరబడి నిర్బంధించడం దుర్మార్గమని అన్నారు.

దస్త్రాలు భద్రం సుమా..!

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: ప్రత్తిపాడు తహసీల్దారు కార్యాలయం అదీ. ఎంతో విలువైన దస్త్రాలు ఉన్న ఆ గది గోడలు చినుకు పడితే చెమ్మతో కనిపిస్తాయి. దస్త్రాలకు తడి తగలకుండా, పెచ్చులూడుతున్న గదిలో నిరంతరం సిబ్బంది పర్యవేక్షిస్తున్నారు. కార్యాలయ భవనాన్ని పునర్నిర్మించడం తప్ప మరమ్మతులు కుదరదని నిర్ధారించారు. ఈ విషయమై కలెక్టరుకు నివేదించారు. పెద్దాపురం ఆర్డీవో కె.రమణి ఇటీవలే గుజ్జన గూడుగా మారిన కార్యాలయ భవనాన్ని పరిశీలించారు. ప్రతిపాదనలు సిద్ధం చేయమని తహసీల్దారు సూర్యప్రభను ఆదేశించారు. భవనం ఎప్పటికీ సమకూరుతుందో చూడాలి మరీ..!



తహసీల్దారు కార్యాలయంలో దస్త్రాలు ఉన్న గది తీరిదీ..

అమ్మవారి గ్రామోత్సవం

కిర్లంపూడి, న్యూస్‌టుడే: దేవీ శరన్నవరాత్రులు తొమ్మిది రోజుల పాటు విశేష పూజలందుకున్న అమ్మవారి ఉత్సవమూర్తిని పల్లకీలో జగపతినగరం, కిర్లంపూడి గ్రామాల్లో ఊరేగించారు. ఆలయ కమిటీ ఛైర్మన్ అడపా ఏడుకొండలు, సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కిర్లంపూడిలోని వాసవీకన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో శమీపూజ నిర్వహించారు. ● ఆదివారం మహాపూర్ణాహుతి, చక్రస్నానం, స్వామివారి ఊరేగింపు కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

తీరంలో సందర్శకుల సందడి

తొండంగి, న్యూస్‌టుడే: దానవాయిపేట సముద్ర తీరం సందర్శకులతో కిటకిటలాడింది. దసరా సెలవులు ముగియడం, ఆదివారం కావడంతో పలు గ్రామాల నుంచి సందర్శకులు ఎక్కువగా దానవాయిపేట తీరానికి వచ్చి స్నానాలు చేస్తూ సందడిగా గడిపారు. యువత స్వీయ చిత్రాలు తీసుకుని సందడి చేశారు.



బస్సును ఢీకొన్న కారు.. భవానీలకు గాయాలు



జగ్గంపేట గ్రామీణం, న్యూస్‌టుడే: జాతీయ రహదారిపై మండలంలోని రామవరం వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు భవానీలకు గాయాలయ్యాయి. పోలీసుల వివరాల ప్రకారం శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళి మండలం కన్నెవలస గ్రామానికి చెందిన కాళ్ల గణపతి, కాళ్ల శాంతి, మరో ఇద్దరు భవానీలు దీక్షల విరమణకు కారులో విజయవాడ ఇంద్రకీలాద్రికి బయల్దేరారు. రామవరం వద్ద అదుపుతప్పి ముందున్న ఆర్టీసీ బస్సును కారు ఢీకొనడంతో ముందు సీట్లో కూర్చున్న శాంతి, గణపతి గాయపడ్డారు. వీరిని హైవే అంబులెన్స్‌లో సీహెచ్‌సీకి తరలించి ప్రాథమిక చికిత్స అనంతరం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. ప్రమాద ఘటనపై ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం

తొండంగి: లిఫియస్ ఫార్మా పరిశ్రమలో ఎలక్ట్రికల్ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న బిహార్‌కి చెందిన వినయ్‌కుమార్ గుప్తా (21) శుక్రవారం సముద్ర స్నానానికి వెళ్లి గల్లంతైన విషయం తెలిసిందే. శనివారం ఆ యువకుడి మృతదేహం గుర్తించారు. తుని ప్రాంతీయ ఆస్పత్రిలో పంచనామా నిర్వహించి బిహార్‌కి పంపినట్లు ఎస్సై జగన్మోహనరావు తెలిపారు.

వృద్ధుడి ఆత్మహత్య

జగ్గంపేట గ్రామీణం: జె.కొత్తూరు నాటుకోళ్ల ఫారంలో పనిచేస్తున్న వృద్ధుడు (75) శనివారం ఆత్మహత్యకు పాల్పడ్డారు. అనారోగ్యంతో ఉన్న ఆయన కోలుకోలేనని భావించి ఆత్మహత్యకు పాల్పడినట్లుగా గ్రామస్థులు చెబుతున్నారు.

కిరాణా దుకాణంలో మద్యం స్వాధీనం

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: ధర్మవరం గ్రామంలోని కిరాణా దుకాణంలో మద్యం సీసాలను ప్రత్తిపాడు ఎస్సై లక్ష్మీకాంతం శనివారం స్వాధీనం చేసుకున్నారు. పోలీసులకు అందిన సమాచారంతో ఆమె శ్రీదుర్గాభవానీ కిరాణా జనరల్ స్టోర్స్‌ను తనిఖీ చేయగా 23 మద్యం సీసాలు దొరికాయని ఎస్సై చెప్పారు. దుకాణం యజమానిపై కేసు నమోదు చేసి అరెస్టు చేశామన్నారు.

వ్యక్తిపై దాడి..కేసు నమోదు

రౌతులపూడి: ఉప్పంపాలెంలో శనివారం ఓ వ్యక్తిపై దాడి జరిగింది. వివరాలివీ.. తూరంగికి చెందిన వేగిశెట్టి సూర్యకృష్ణారావు తన పొలంలో పని చేసుకుంటున్న సమయంలో ఘర్షణ జరిగింది. తనపై ఎల్.గంగాధర్, బి.యర్రయ్య అనే వ్యక్తులు ఘర్షణ పడి కత్తితో దాడి చేశారని సూర్య కృష్ణారావు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

బస్సులో మారిన బ్యాగులు అప్పగింత

తుని, న్యూస్‌టుడే: బస్సులో ప్రయాణిస్తున్న వారి బ్యాగులు మారిపోగా తిరిగి ఎవరి వస్తువులు వారికి సురక్షితంగా అప్పగించామని పట్టణ సీఐ ఎం.గీతా రామకృష్ణ తెలిపారు. విశాఖలోని అగనంపూడికి చెందిన డోలా వినోద్‌కుమార్ ఆర్టీసీ బస్సులో కాకినాడకు శనివారం వెళుతుండగా మార్గమధ్యలో అన్నవరం వద్ద బ్యాగు కనిపించలేదు. దీంతో ఆయన బస్సు ముందు ఆగిన తుని డిపోలో ఎవరైనా తీసి ఉంటారని భావించి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తక్షణం స్పందించిన పోలీసులు ఆయా ప్రాంతాల్లోని సీసీ కెమెరాలు క్షుణ్నంగా పరిశీలించి బ్యాగును పోలిన మరో బ్యాగు ఉండటంతో తోటి ప్రయాణికులు తీసుకుని దిగిపోయి ఉంటారని భావించారు. ఆ దిశగా దర్యాప్తు చేస్తున్న నేపథ్యంలో తుని తెదేపా నాయకుడు సుర్ల లోవరాజుకు ఇక్కడకు వచ్చిన గాజువాకకు చెందిన మండల అశోక్, అతని భార్య సాయిలక్ష్మీలు ఫోన్‌చేసి తమ బ్యాగు మారిందని చెప్పారు. ఈ విషయాన్ని లోవరాజు పోలీసులకు తెలియజేయడంతో ఇరువురినీ పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి ఎవరి బ్యాగులు వారికి అప్పగించారు. వినోద్‌కుమార్ బ్యాగులో దుస్తులతోపాటు ఉన్న 8 కాసుల బంగారం, రూ.45 వేలు నగదు భద్రంగా అప్పగించిన అశోక్ దంపతులు, ఈ కేసులో చురుగ్గా వ్యవహరించిన కానిస్టేబుళ్లు శ్రీనివాస్, డి.చిన్నారావు, సీహెచ్ అప్పలనాయుడులను పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు, తుని సీఐ గీతారామకృష్ణ అభినందించారు. ప్రయాణంలో విలువైన బంగారు ఆభరణాలు, ఎక్కువ మొత్తంలో నగదు తీసుకెళ్లే వారు అజాగ్రత్తగా వ్యవహరించొద్దని సీఐ సూచించారు.